
రంగారెడ్డి | వికారాబాద్ | మేడ్చల్



వార్త

కళ్ల ముందే

# కాలిపోయిన జీవనాధారం

**★మొయినాబాద్‌లో భారీ అగ్నిప్రమాదం ★మంటల్లో చిక్కుకుని మూడు దూడల మృతి.. ★10 గేదెలకు తీవ్ర గాయాలు**

**మొయినాబాద్, మే 31 ప్రభాతవార్త:** మొయినాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలోని చందానగర్ గ్రామంలో ఆదివారం మధ్యాహ్నం భారీ అగ్నిప్రమాదం సంభవించింది. విద్యుత్ తీగలు ఒకదానికొకటి రాపిడై షార్ట్ సర్క్యూట్ ఏర్పడటంతో చెలరేగిన మంటలు ఒక గేదెల షెడ్డుపై పడటంతో ఈ ప్రమాదం జరిగింది. ఈ దుర్ఘటనలో మూడు దూడలు అక్కడికక్కడే మృతి చెందగా, పది గేదెలు తీవ్రంగా గాయపడ్డాయి. షెడ్‌తో పాటు పక్కనే నిలిపి ఉంచిన ట్రాక్టర్ కూడా పూర్తిగా కాలి బూడిదైంది. ఈ ఘటనతో చందానగర్ గ్రామంలో తీవ్ర విషాద ఛాయలు అలుముకున్నాయి.



అగ్నికీలల్లో చిక్కుకుని ఒళ్లంతా పుండ్లు అయిన గేదెలు

**విద్యుత్ శాఖ నిర్లక్ష్యమే కారణం?**

బాధిత రైతు రాజేందర్ రెడ్డి, భూ యజమాని మొర నరసింహారెడ్డితోపాటు స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... రాజేందర్ రెడ్డి స్వయం ఉపాధి కోసం నరసింహారెడ్డి వద్ద వ్యవసాయ భూమిని లీజుకు తీసుకుని, సుమారు 15 గేదెలు, ఆవులతో పాల ఉత్పత్తి చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. అయితే, షెడ్ సమీపంలో ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ తీగలపై గతంలోనే పలుమార్లు విద్యుత్ శాఖ



సజీవదహనం అయిన దూడ

**అధికారుల నిర్లక్ష్యం ఒక పేద కుటుంబానికి కోలుకోలేని శోకాన్ని మిగిల్చింది. రెక్కల కష్టాన్ని నమ్ముకుని, పాడి పరిశ్రమ ద్వారా కుటుంబాన్ని పోషించుకుంటున్న ఒక రైతు కళ్ల ముందే జీవనాధారమైన మూగజీవాలు మంటల్లో కాలి బూడిదయ్యాయి. విద్యుత్ తీగలు ఒకదానికొకటి రాపిడై షార్ట్ సర్క్యూట్ సంభవించడంతో ఒక గేదెల షెడ్డు పూర్తిగా అగ్నిప్రమాదానికి గురైంది. ఈ ఘోర దుర్ఘటనలో మూడు దూడలు అక్కడికక్కడే కాలిపోయి మృతి చెందగా, మరో పది గేదెలు ప్రాణాపాయ స్థితిలో కొట్టుమిట్టాడుతున్నాయి. సుమారు 10 లక్షల రూపాయల ఆస్తి నష్టం వాటిల్లడంతో పాటు సర్వస్వం కోల్పోయిన బాధిత రైతు రాజేందర్ రెడ్డి కన్నీటి పర్యంతమవడంతో చందానగర్ గ్రామంలో తీవ్ర విషాద ఛాయలు అలుముకున్నాయి.**



అగ్నిప్రమాదానికి దగ్ధమైన పశువుల షెడ్

**అధికారులకు ఫిర్యాదు చేసినా..**

అధికారులకు ఫిర్యాదు చేసినా ఎలాంటి చర్యలు తీసుకోలేదని బాధితులు ఆరోపిస్తున్నారు. అధికారులు ముందస్తు చర్యలు తీసుకుని ఉంటే ఈ ప్రమాదం జరిగేది కాదని గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

**భారీ గాలికి తెగిన విద్యుత్ వైర్లు**

ఆదివారం మధ్యాహ్నం సుమారు 2 గంటల సమయంలో బలమైన గాలి వీయడంతో విద్యుత్ తీగలు ఒకదానికొకటి తాకి షార్ట్ సర్క్యూట్ అయింది. నిప్పురవ్వలు షెడ్డుపై పడటంతో క్షణాల వ్యవధిలోనే మంటలు వ్యాపించి లోపల ఉన్న గడ్డి, కలప సామగ్రి పూర్తిగా దగ్ధమయ్యాయి. ప్రమాద తీవ్రతకు మూడు దూడలు విద్యుత్ ఘాతంతో అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోగా, పది గేదెలకు తీవ్ర గాయాలయ్యాయి. కొన్ని పశువుల శరీర భాగాలు పూర్తిగా కాలిపోవడంతో వాటి పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలుస్తోంది.

**రూ.10 లక్షలకు పైగా నష్టం**

'ఎన్నో కష్టాలు పడి పాడి పరిశ్రమ ద్వారా కుటుంబాన్ని పోషించుకుంటున్నాను. ప్రమాదకర విద్యుత్ తీగల గురించి అధికారులు పట్టించుకోకపోవడం వల్లే ఈ రోజు నా జీవనోపాధి దెబ్బతింది. ఈ ప్రమాదంలో సుమారు రూ.10 లక్షలకు పైగా నష్టం వాటిల్లింది' అని బాధితుడు కన్నీటి పర్యంతమయ్యాడు. విచారణ జరపాలని డిమాంద్ర్రమాద సమాచారం అందుకున్న పోలీసులు, సంబంధిత అధికారులు సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. విద్యుత్ శాఖ అధికారుల నిర్లక్ష్యంపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని, సర్వస్వం కోల్పోయిన బాధిత రైతు కుటుంబానికి ప్రభుత్వం తక్షణమే ఆర్థిక సహాయం అందించి ఆదుకోవాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు.

# కట్టెల కోసం వెళ్లి.. కాలగర్భంలోకి

## నందిగామలో రైలు ఢీకొని ఇద్దరు బీహార్ మహిళల దుర్మరణం

**ఉపాధి వెతుక్కుంటూ సుదూర బీహార్ ప్రాంతం నుండి వచ్చిన ఆ ఇద్దరు మహిళలను నందిగామ రూపంలో మృత్యువు కబళించింది. ఆదివారం సెలవు దినం కావడంతో కట్టెల కోసం వెళ్లిన ఆ యువతులు.. తిరిగి వస్తూ రైల్వే ట్రాక్ దాటుతుండగా వేగంగా దూసుకొచ్చిన రైలు రూపంలో మరణం వారిని వెంటాడింది. ఈ ఘోర ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన ఇద్దరు మహిళలు ఆసుపత్రికి చేరేలోపే ప్రాణాలు విడిచిన ఘటన నందిగామ మండల కేంద్రంలో తీవ్ర విషాదాన్ని నింపింది. వివరాలలోకి వెళితే..**

**నందిగామ, మే 31, ప్రభాతవార్త :** నందిగామ మండల కేంద్రంలో ఉపాధి నిమిత్తం బీహార్ ప్రాంతం నుండి నంది గామకు వచ్చిన ఇద్దరు దాదాపు 20 నుంచి 22 ఏళ్ల వయసు ఉన్న మహిళలు ఆదివారం సెలవు దినం కావడంతో కట్టెల కోసం అని వెళ్లారు. వారు తిరిగి వస్తూ రైల్వే ట్రాక్ దాటుతుండగా, సికింద్రాబాద్ నుండి మహబూబ్‌నగర్ వైపు వెళ్తున్న రైలు వీరిని బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఇరువురికి తీవ్ర గాయాలు కాగా, స్థానికులు వారిని అదే ట్రైన్‌లో షాద్‌నగర్ రైల్వే స్టేషన్ కు తీసుకెళ్లి, అక్కడ నుండి అంబులెన్స్‌లో ఆసుపత్రికి తరలించారు. అయితే పరిస్థితి విషమించడంతో వారు ఆసుపత్రికి వెళ్లే లోపే మృతి చెంది నట్లు స్థానికులు పేర్కొన్నారు. ఈ సంఘటనపై రైల్వే పోలీ సులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నారు. మృతి చెందిన మహిళల పూర్తి వివరాలు ఇంకా తెలియాల్సి ఉంది.



మృతుల బంధువుల నుంచి వివరాలు సేకరిస్తున్న పోలీసులు

### అమ్మవారి దర్శనానికి వెళ్తుండగా తీరని విషాదం

**అదుపుతప్పి చెట్టును ఢీ కొట్టిన కారు**

**ఒకరు మృతి, ఇద్దరికి తీవ్ర గాయాలు**

**కడ్తాల్ మే 31, ప్రభాతవార్త :** రంగారెడ్డి జిల్లా కడ్తాల్ మండలం మక్తమాదారం గ్రామ శివారులో ఆదివారం సాయంత్రం జరిగిన కారు ప్రమాదంలో ఒకరు దుర్మరణం పాలవగా, మరో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. కడ్తాల్ సిఐ సైదిరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. కేశంపేట మండలం ఏక్లాస్ ఖాన్ పేటకు చెందిన బోడనంపల్లి శివ (23) తన స్నేహితులైన పవన్ కుమార్, అనిల్ (పాపిరెడ్డి గూడ) లతో కలిసి కారులో మైసిగండి మైసమ్మ దర్శనానికి బయలుదేరారు. మక్తమాదారం శివారులోని నరేంద్ర విద్యాలయం మూల మలుపు వద్దకు రాగానే వీరు ప్రయాణిస్తున్న కారు అదుపుతప్పి చెట్టును ఢీకొంది. ఈ ప్రమాదంలో శివ అక్కడికక్కడే మృతి చెందగా, పవన్, కుమార్ తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం శంషాబాద్ ఆస్పత్రికి తరలించగా, శివ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కల్వకుర్తి ఆసుపత్రికి తరలించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నారు.

# అర్ధరాత్రి మట్టి మాఫియా గుట్టురట్టు

### ఐదు వాహనాలు సీజ్

**శామీర్‌పేట, మే 31 ప్రభాతవార్త:** మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా మూడుచింతలపల్లి మండల కేంద్రంలో మట్టి మాఫియా రెచ్చిపోతోంది. అధికారుల కళ్లు గప్పి రాత్రి సమయాల్లో ప్రభుత్వ భూములను యథేచ్ఛగా తవ్వేస్తూ సొమ్ము చేసుకుంటోంది. తాజాగా శనివారం అర్ధరాత్రి ప్రభుత్వ భూమిలో అక్రమంగా మట్టి తవ్వకాలు జరుపుతుండగా రెవెన్యూ అధికారులు దాడి చేసి, భారీగా వాహనాలను సీజ్ చేశారు.

**స్థానికులపై దౌర్జన్యం**

మూడుచింతలపల్లిలోని శాలవాని కుంటకు సమీపంలో ఉన్న ప్రభుత్వ భూమిలో పెద్ద ఎత్తున జేసీబీలు, టిప్పర్లు పెట్టి అక్రమంగా మట్టిని తరలిస్తున్నారు. అర్ధరాత్రి వేళ వాహనాల రాకపోకలు, జేసీబీల శబ్దాలు రావడంతో స్థానికులు అక్కడికి చేరుకుని మట్టి తవ్వకాలను అడ్డుకునే ప్రయత్నం చేశారు. అయితే, మట్టి దళారులు ఏమాత్రం వెనక్కి తగ్గకుండా... ఏం చేసుకుంటారో చేసుకోండి అంటూ స్థానికులను తీవ్రంగా బెదిరించారు.

**రంగంలోకి దిగిన రెవెన్యూ సిబ్బంది**

దళారుల బెదిరింపులతో స్థానికులు వెంటనే మండల రెవెన్యూ అధికారులకు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న వెంటనే రెవెన్యూ సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకున్నారు.



మూడుచింతలపల్లిలోని ప్రభుత్వ భూమిలో మట్టి తవ్వకాలు జరిపిన దృశ్యం



పోలీసులు అదుపులోకితీసుకున్న మట్టి లోడు టిప్పరు

అక్కడ అక్రమంగా మట్టి తవ్వి తరలిస్తున్న విషయాన్ని గమనించి, తవ్వకాలకు ఉపయోగిస్తున్న రెండు జేసీబీలను, మట్టిని తరలిస్తున్న మూడు టిప్పర్లను స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడిన ఐదు వాహనాలను మండల తహసీల్దార్ కార్యాలయానికి తరలించినట్లు సిబ్బంది తెలిపారు.

**ఆందోళనలో స్థానికులు**

తహసీల్దార్ కార్యాలయానికి కూతవేటు దూరంలోనే ఉన్న ప్రభుత్వ భూముల్లో ఇంత దర్జాగా అక్రమ తవ్వకాలు జరగడంపై స్థానికులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వ భూములతో పాటు చెరువులు, కుంటలకు కూడా మట్టి దళారుల నుంచి రక్షణ కరువైందని వారు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. ప్రభుత్వ సంపదను దోచుకుంటూ, ప్రశ్నించిన వారిని బెదిరింపులకు గురిచేస్తున్న మట్టి మాఫియాపై సమగ్ర విచారణ జరిపి చట్టపరమైన కఠిన చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

ఈ వ్యవహారంపై ఇప్పటికే ఉన్నతాధికారులకు నివేదిక చేరిందని, సోమవారం (రేపు) అక్రమార్కులపై చట్టరీత్యా కఠిన చర్యలు తీసుకునే అవకాశం ఉందని రెవెన్యూ సిబ్బంది పేర్కొన్నారు.

## రూ 58వేల విలువైన ఆక్సిటోసిన్ ఇంజక్షన్లు స్వాధీనం

**రంగారెడ్డి మే 31,ప్రభాతవార్త :** శంషాబాద్ మున్సిపాలిటీ పరిధిలో ఎస్ఓటి పోలీసులు దాడులు చేసి 58,000 రు విలువైన ఆక్సిటోసిన్ ఇంజక్షన్లు స్వాధీనం చేసుకున్నారు. మండల పరిధిలో జూకల్ గ్రామానికి చెందిన మహేందర్ రెడ్డి పశువుల దాన సరఫరా,సరూర్నగర్ చెందిన ప్రతాపరెడ్డి డైరీ ఫార్మ్ వ్యాపారం నిర్వహిస్తున్నాడు.డబ్బులు ఈజీగా సంపాదించడం కోసం గుజరాత్ నుంచి నిషేధిత ఆక్సిటోసిన్ ఇంజక్షన్ తీసుకొచ్చి విక్రయిస్తున్నాడు పక్క సమాచారంతో ఎస్ఓటి పోలీసులు దాడి చేయగా నిల్వ ఉన్న 2003 ఆక్సిటోసిన్ బాటిల్లు స్వాధీనం చేసుకున్నారుకేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

## విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలి

### రాష్ట్ర గవర్నర్ శివ్ ప్రతాప్‌శుక్లా

**శంకర్‌పల్లి, మే 31, ప్రభాతవార్త :** శంకర్‌పల్లి మండల పరిధిలోని మోకిల గ్రామ శివారులో ఆది వారం ది క్వాంటియం స్కూల్‌ను రాష్ట్ర గవర్నర్ శివ్ ప్రతాప్ శుక్ల ముఖ్య అతిథిగా హాజరై పాఠశాల చైర్మన్ వెంకట్ ముర్కి, నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అరవింద్, మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్, ఎమ్మెల్సీ మల్క కొమరయ్య, చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్యలతో కలిసి లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా గవర్నర్ మాట్లాడుతూ విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలని కోరారు. గ్రామీణ వాతావరణంలో స్కూల్ లు రావడం సంతోషించ దగ్గ విషయం అన్నారు. ఎమ్మెల్యే యాదయ్య మాట్లాడుతూ పాఠశాలలో చేరే విద్యార్థులకు ఫీజులు తక్కువ తీసుకోవాలి. మా నియోజకవర్గ ప్రాంత విద్యార్థులకు అవకాశం కల్పించాలి. పాఠశాల యాజమాన్యానికి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే కే.ఎస్.రత్నం, మోకిల సర్పంచ్ శేఖర్, పాఠశాల యాజమాన్యం రవీందర్ రావు, రఘునాథ్ రావు, ప్రిన్సిపల్ సంధ్య రమేష్, వివిధ పార్టీలకు చెందిన నాయకులు, పాల్గొన్నారు.



కార్యక్రమంలో పాల్గొన్న గవర్నర్

## ఎట్టకేలకు వికారాబాద్ డిఇవో రేణుక బదిలీ!

**వికారాబాద్, ప్రభాతవార్త :** సుదీర్ఘ కాలంగా వికారాబాద్ జిల్లా విద్యాధికారిగా బాధ్యతలు నిర్వర్తించిన రేణుకాదేవి ఎట్టకేలకు బదిలీ అయ్యారు. ఈ మేరకు ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. 2017 డిసెంబర్ నెలలో రేణుకాదేవి వికారాబాద్ డీఈఓ గా బాధ్యతలు చేపట్టారు. జిల్లాలో దాదాపు 8 సంవత్సరాల పాటు రేణుకాదేవి డీఈఓగా విధులు నిర్వహించారు. ప్రస్తుతం రేణుకాదేవిని మేడ్చల్ జిల్లాకు బదిలీ చేయగా, ఆమె స్థానంలో వనపర్తి జిల్లా డీఈఓ గా విధులు నిర్వహిస్తున్న అబ్దుల్ ఘని వికారాబాద్ జిల్లా ఫుల్ అడిషనల్ చార్జి (ఎఫ్ఏసీ) డీఈఓ బదిలీ చేసినట్లు ఉత్తర్వులో పేర్కొన్నారు. త్వరలో అబ్దుల్ ఘనీ వికారాబాద్ డీఈఓగా బాధ్యతలు స్వీకరించనున్నట్లు సంబంధిత శాఖ అధికారులు తెలిపారు.



బదిలీ అయిన డిఇవో రేణుకా దేవి

**విజయకుమారిని మహబూబ్‌నగర్‌కు..**

**మేడ్చల్ జిల్లా ప్రతినిధి, మే 31, ప్రభాతవార్త:** మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లా విద్యా అధికారిణి (డిఇఓ) ఐ.విజయకుమారి బదిలీ అయ్యారు. ఇక మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లా నూతన డిఇఓగా రేణుక నియమితులయ్యారు. ఆదివారం పలు జిల్లాల డిఇఓల బదిలీ విషయం వెలుగులోకి వచ్చింది. రాష్ట్ర ప్రభుత్వం పలు జిల్లాల విద్యాశాఖ అధికారులను బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లా డిఇఓగా పనిచేసిన ఐ.విజయకుమారి మహబూబ్‌నగర్ జిల్లా డిఇఓగా బదిలీ కాగా, వికారాబాద్ జిల్లా డిఇఓ రేణుక మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లా డిఇఓగా బదిలీ అయ్యారు. అయితే మూడు సంవత్సరాలకు పైగా జిల్లాలో పనిచేసిన డిఇఓలను ప్రభుత్వం బదిలీ చేసిందని స్పష్టం అవుతుంది. మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లా డిఇఓగా పనిచేసిన ఐ.విజయకుమారి మూడేళ్లకు పైగా పనిచేసింది. గతంలోనూ ఓ సారి మేడ్చల్ జిల్లా డిఇఓగా మూడేళ్ల పాటు పనిచేశారు. ఆ మధ్యలో ఆమె రంగారెడ్డి జిల్లాకు బదిలీపై వెళ్లారు. ఆ తరువాత మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లాకు డిఇఓగా విచ్చేయటం జరిగింది. ఇక డిఇఓల బదిలీ ఉత్తర్వులు జారీ కావటంతో ఇక సోమవారం డిఇఓ రిలీవ్ కావచ్చని, కొత్త డిఇఓ రేణుక కూడ సోమవారం విచ్చేసి బాధ్యతలు స్వీకరించవచ్చని సమాచారం.

## అంబేద్కర్ ఆశయసాధన కోసం 'నిత్య పూలమాల'

**ఘట్‌కేసర్, మే 31, ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకల్లో అన్ని ప్రభుత్వ శాఖలు, కార్యాలయాలు, ప్రభుత్వ సంస్థలలో డా.బాబాసాహెబ్ అంబేద్కర్ చిత్రపటాన్ని తప్పనిసరిగా ఏర్పాటు చేయాలని పిబిఐ మేడ్చల్ జిల్లా సమన్వయకర్త ఎం.అరుణ్‌కుమార్ అన్నారు. ఘట్‌కేసర్‌లో ఆదివారం ప్రబుద్ధభారత్ ఇంటర్నేషనల్ సంస్థ ఆధ్వర్యంలో అంబేద్కర్ ఆలోచనా విధానాన్ని ప్రజలలోకి తీసుకువెళ్లడానికి 268వ వారం నిత్యపూలమాల కార్యక్రమం నిర్వహించారు. ఎస్ఎస్‌సీ మండల టాపర్-జ్యోతిబాపూలే ప్రతిభా పురస్కార గ్రహీత చక్కా యామిని విచ్చేసి అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. పిబీఐ మేడ్చల్ జిల్లా సమన్వయకర్త మీసాల అరుణ్‌కుమార్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో యామిని అంబేద్కర్ అందించిన సేవలను, పోరాటాలను తెలియజేస్తూ ఆయన ఆశయాల సాధనకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని కోరారు. అంబేద్కర్‌ను స్ఫూర్తిగా తీసుకొని యువత అజ్ఞానం వీడి జ్ఞానం వైపు నడవాలని తెలిపారు. అనంతరం అందరూ భారత రాజ్యాంగ పీఠికపై ప్రమాణం చేశారు. ఈకార్యక్రమంలో అంబేద్కర్ యువజన సంఘం అధ్యక్షులు మేకల దాసు, నాయకులు సిహెచ్.సత్యనారాయణ, సిహెచ్.కవిత, బందారు రాందాస్, కె.నర్సింగ్‌రావు, ఉట్కూరి అశోక్‌గౌడ్, విశాల్ తదితరులు పాల్గొన్నారు.



# పేకాట స్థావరంపై మెరుపుదాడి

### దేవాదాయ శాఖ ఉద్యోగి సహా 15మంది పరారీ..?

### ముగ్గురి అరెస్ట్, ఓకారు, రెండు బైక్లు సీజ్

**చేవెళ్ల, మే 31, ప్రభాతవార్త :** ఎస్ఓటీ పోలీసులు పేకాట రాయుళ్ల పనిపట్టారు. పేకాట స్థావరమే లక్ష్యంగా మెరుపు దాడులు చేపట్టారు. విశ్వసనీయ సమాచారం మేరకు శనివారం రాత్రి ఎస్ఓటీ పోలీసులు చేవెళ్ల మున్సిపల్ పరిధిలోని కందవాడ (6వ వార్డు), లొద్ది శివార్లలలో గల ఓ పౌంహౌస్‌పై దాడి చేశారు. ఇందులో పేకాట ఆడుతున్న ముగ్గురిని పోలీసులు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. వీరివద్ద గల నగదుతోపాటు, ఒక కారు, రెండు బైకులను సీజ్ చేసి చేవెళ్ల పోలీస్ స్టేషన్‌లో అప్పగించారు. పూర్తి వివరాల్లోకి వెళ్తే చేవెళ్ల సీఐ భూపాల్ శ్రీధర్ తెలిపిన వివరాల ప్రకారం.. మున్సిపల్ పరిధిలోని విశ్వసనీయ సమాచారం మేరకు. ఎస్ఓటీ పోలీసులు కందవాడ శివార్లలలోని మహిపాల్ పౌంహౌజ్ పై మెరుపు దాడులు నిర్వహించారు. ఈ సమయంలో పోలీసులను చూసి పేకాట ఆడుతున్నవారు పారిపోయేందుకు ప్రయత్నించారు. కానీ వీరి ఆటలు సాగలేవు. పేకాట ఆడుతున్న ముగ్గురిని పోలీసులు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. పేకాట ఆడుతూ.. పట్టుబడిన వారిలో చేవెళ్ల మున్సిపల్ పరిధిలోని పల్గుట్ట గ్రామానికి చెందిన మంగలి వెంకటేష్, కందవాడ గ్రామానికి చెందిన బండ ఎవాన్, కావలి మహిపాల్ లు ఉన్నారు. వీరు, మరికొంత మంది గత కొంతకాలంగా కందవాడ శివారు ప్రాంతంలో ప్రతినిత్యం పేకాట అడుతున్నారు. విశ్వసనీయ సమాచారం మేరకు మెరుపు దాడి చేయగా పై ముగ్గురు పట్టుబడటం జరిగింది. పేకాట ఆడెందుకు వస్తున్న మరో పదిహేను మంది విషయం తెలిసి అటునుంచే అటు పారిపోయిన్నట్లు తెలిసింది. పేకాటరాయుళ్ల నుంచి రూ.2,044 నగదు, ఓ క్రెట కారు టీఎస్07 పీ0919, ప్యాషన్ ప్రొబైక్ టిఎస్07 జీసి6140, స్పెండర్ ప్లస్ బైక్ టీఎస్07 ఈకె3187లను అదుపులోకి తీసుకుని సీజ్ చేశారు. కాగా పేకాట ఆడుతూ.. పట్టుబడిన ముగ్గురిలో ఒకరైన కావలి మహిపాల్ దేవాదయ ఉద్యోగి. ఇతను శంషాబాద్ మండల పరిధిలోని గాన్స్ వాన్ గూడ మైసమ్మ ఆలయంలో క్యాషియర్ గా పనిచేస్తున్నారు. ఈ మేరకు వీరిపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ భూపాల్ శ్రీధర్ తెలిపారు.



పోలీసులకు చిక్కిన పేకాటరాయుళ్లు

**జూదరులపై ఉక్కుపాదం మోపుతాం: సిఐ**

చేవెళ్ల పీఎస్.పేకాట, బెట్టింగ్, ఆన్ లైన్ గెమింగ్, చిన్నపిల్లల, బాలికల అక్రమ రవాణ చట్టరిత్య నేరం. ముఖ్యంగా పేకాట, క్రికెట్ బెట్టింగ్. ఆన్ లైన్ గెమింగ్ కు యువత బానిస కావటం శోచనీయం. ఏంతో భవిష్యత్ గల యువత జీవితం పక్కదారి పడుతుంది. జూదంలో డబ్బులు పొగట్టుకుని అప్పులపాలు అవుతున్నారు. అప్పులు తీర్చలేక ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. జూదరులపై ఉక్కుపాదం మోపుతాం. చట్టానికి వ్యతిరేఖంగా ప్రవర్థిస్తే ఎంతటివారైన క్షమించేదిలేదు. పేకాట, క్రికెట్ బెట్టింగ్ పాల్పడే వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తప్పవని చేవెళ్ల సీఐ భూపాల్ శ్రీధర్ వెల్లడించారు.

### సోలిపేట్ ఫామ్ హౌస్‌లో

# హుక్కా పార్టీ

**సూపర్వైజరే సూత్రధారి**

**పరికరాలను సాధీనం చేసుకున్న పోలీసులు**

**షాబాద్, మే31, ప్రభాతవార్త :** షాబాద్ మండల పరిధిలోని సోలిపేట్ గ్రామ పరిధిలోని ఉన్న టెర్రా స్కై ఫామ్ హౌస్‌లో అనుమతులు లేకుండా నిర్వహిస్తున్న హుక్కా పార్టీపై షాబాద్ పోలీసులు శనివారం రాత్రి దాడి చేసి హుక్కా సామాగ్రి స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు గస్తీ విధుల్లో ఉన్న ఎస్సై టి. రమేష్, హెడ్ కానిస్టేబుల్ పి. రమేష్, ఏఆర్పీపీ రాజు కలిసి సోలీపేట్ గ్రామంలో తనిఖీలు నిర్వహిస్తున్న సమయంలో టెర్రా స్కై ఫామ్ హౌస్లో కొందరు వ్యక్తులు హుక్కా పార్టీ నిర్వహిస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం అందింది. దీంతో వెంటనే ఫామ్ హౌస్‌కు చేరుకొని తనిఖీలు చేపట్టగా, అక్కడ పలువురు హుక్కా సేవిస్తూ పార్టీ చేసుకుంటున్నట్లు గుర్తించారు. ఈ క్రమంలో ఫామ్ హౌస్ సూపర్వైజర్ వడ్ల మహేందరాచారి నిర్వహించినట్లు, వాచ్‌మెన్ సతీష్ సహకరించినట్లు గుర్తించారు. పార్టీ నిర్వహణకు ఎలాంటి అనుమతులు లేవని, 4చిన్న హుక్కా కుండలు, 1 పెద్ద చిన్నహుక్కా కుండా 5 హుక్కా పైపులను స్వాధీనం చేసుకున్నారు. నిర్వాహకులపై కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.



# ఓడిపోయినా మారలేదు..

**ఒకే వ్యక్తి చుట్టూ రాజకీయం ఎందుకు**

**గులాబీ సభలో అసంతృప్తి జ్వాలలు**

**వలస నేతలకు ప్రాధాన్యంపై ఉద్యమకారుల ధిక్కార స్వరం!**

**మాజీ మున్సిపల్ అధ్యక్షుడు భాస్కర్ యాదవ్ తీరుపై అసంతృప్తి**



మాట్లాడుతున్న బిఆర్ఎస్ నేతలు

**మేడ్చల్, మే 31 ప్రభాతవార్త :** మేడ్చల్ పట్టణంలో ఆదివారం నిర్వహించిన బీఆర్ఎస్ పార్టీ మేడ్చల్ ఉమ్మడి మండల కార్యకర్తల సమావేశం తీవ్ర ఉద్రిక్తతకు దారితీసింది. మల్కాజిగిరి పార్లమెంట్ పార్టీ ఇంచార్జ్ రాగిడి లక్ష్మారెడ్డి ప్రసంగిస్తున్న సమయంలోనే పలువురు తెలంగాణ ఉద్యమకారులు, పార్టీ సీనియర్ కార్యకర్తలు ఒక్కసారిగా లేచి పార్టీ నాయకత్వ వైఖరిపై తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. రావల్ కోల్ గ్రామానికి చెందిన ఉద్యమకారుడు సాయిలుతో పాటు పలువురు నాయకులు తమకు పార్టీలో జరుగుతున్న అన్యాయం, అవమానాలు, నిర్లక్ష్యాన్ని బహిరంగంగా ప్రస్తావిస్తూ నాయకత్వాన్ని నిలదీశారు.

**అసలు ఉద్యమకారులనే పక్కన పెట్టారు..**

పార్టీ ఆవిర్భావం నుంచి తెలంగాణ రాష్ట్ర సాధన వరకు జరిగిన పోరాటాన్ని గుర్తు చేశారు. వేలాది మంది కార్యకర్తల త్యాగాలు, 1200 మంది అమరుల బలిదానాలతో ఏర్పడిన పార్టీ నేడు అసలు ఉద్యమకారులనే పక్కన పెట్టిందని ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణ రాష్ట్రం కోసం పోరాడిన వారిని గుర్తించకుండా, అధికారంలో ఉన్న సమయంలో వారికి కనీస ప్రాధాన్యత ఇవ్వకపోవడం వల్లే ప్రజల్లో పార్టీపై వ్యతిరేకత పెరిగిందని, అదే గత ఎన్నికల్లో పార్టీ ఘోర పరాజయానికి ప్రధాన కారణమైందని పేర్కొన్నారు.

**ఫ్లెక్సీల్లో ఫొటోలు లేవు.. సమావేశాల్లో స్థానం లేదు**

తెలంగాణ జెండా పుట్టిన రోజు నుంచి పార్టీ కోసం పనిచేస్తున్న ఉద్యమకారులకు కనీస గుర్తింపు కూడా లేకుండా చేశారని వారు ఆరోపించారు. మేడ్చల్ నియోజకవర్గ వ్యాప్తంగా వందలాది ఫ్లెక్సీలు, హోర్డింగ్లు ఏర్పాటు చేసినప్పటికీ మిగతా 4లో

## పని చేసే వారికి గుర్తింపు ఉంటుంది

**నందిగామ, మే 31, ప్రభాతవార్త :** నందిగామ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా నియమితులైన దేపల్లె కుమార్ గౌడ్ ను ఆదివారం నందిగామ మాజీ సర్పంచ్ ఎదిరే వెంకయ్య గౌడ్ సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ షాద్నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ నేతృత్వంలో కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షులుగా నియమితులు కావడం అదృష్ట వంతులని అన్నారు. మీ మీద పెట్టుకున్న నమ్మకాన్ని వమ్ము చేయకూడదని ఊరు రా పార్టీని మరింత బలోపేతం చేసి మంచి పేరు తెచ్చుకోవాలని ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ తనయుడు ఏదిరే శ్రీకాంత్ గౌడ్, నాయకులు శివగళ్ళ సుమన్, పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.


నందిగామ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షున్నీ సన్మానించిన మాజీ సర్పంచ్ వెంకయ్య గౌడ్

## ఉద్యమకారులను గుర్తించాలి

**నందిగామ, మే 31, ప్రభాతవార్త :** తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించాలని, తెలంగాణ ఉద్యమకారులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని రంగారెడ్డి జిల్లా బీసీ, ఎస్సీ, ఎస్టీ జేఏసీ అధ్యక్షుడు, మలిదశ తెలంగాణ ఉద్యమ నేత జంగ రజనీకాంత్ యాదవ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం ఆయన నందిగామలో మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ ఉద్యమకారులకు ఇచ్చిన హామీలను తక్షణమే నెరవేర్చాలని, ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండున్నర సంవత్సరాలు అవుతున్న ఉద్యమకారులను గుర్తించక పోవడం బాధాకరమన్నారు. ఇప్పటికైనా జూన్ 2 న జరిగే తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ వేడుకల లోపు ఉద్యమకారులను వారికి అన్ని విధాల సహాయ సహకారాలు అందించాలని పేర్కొన్నారు.

## గ్రామాభివృద్ధికి కృషి


సిసి రోడ్డు పనులను ప్రారంభిస్తున్న సర్పంచ్ చేవెళ్ల నవనీతస్వామి

**షాబాద్, మే31, ప్రభాతవార్త :** గ్రామాభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని చందన్వెల్లి సర్పంచ్ చేవెళ్ల నవనీతస్వామి అన్నారు. మండల పరిధిలోని చందన్వెల్లి కొత్త కాలనీలో రూ. 10 లక్షల నిధులతో 550 మీటర్ల సిసి రోడ్డు పనులను ఆదివారం ఆమె ప్రారంభిం చారు. ఈ సందర్భంగా ఆమే మాట్లాడుతూ... చందన్వెల్లిలో కొత్త కాలనీ 2008లో ఏర్పడిందని, అప్పటి నుండి అభివృద్ధికి నోచుకోలేదన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తరువాత మౌలిక వసతులు మంచినీరు, సిసిరోడ్లు, విద్యుత్, అండర్ డ్రైనేజీ పనులను పూర్తి చేశామన్నారు. గ్రామాభివృద్ధికి ఇంకా కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ శ్రీశైలం, వార్డు సభ్యులు వెంకటేష్, రాఘవాచారి, గ్రామస్తులు కిష్టయ్య, మహేందర్ రెడ్డి, వరప్రసాద్, రాంచందర్, వీరేష్, రాజమౌళి, రాజు, కిష్టయ్య, సుధాకర్ రెడ్డి, గిరిబాబు తదితరులు పాల్గొన్నారు.

## ఖానాపూర్‌లో యువకుడి ఆత్మహత్య

**పెద్దేముల్, మే 31, ప్రభాతవార్త:** ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన పెద్దేముల్ పోలిస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్ఐ ప్రశాంత్‌వర్ధన్ తెలిపిన వివరాల ప్రకారం.. పెద్దేముల్ మండలం ఖానాపూర్ గ్రామానికి చెందిన జోగు రవి ( 26) కూలి పనిచేసుకుంటు జీవనం సాగించేవాడు. అయితే గత కొంతకాలంగా మద్యానికి బానిసై ఎటువంటి పనిచేయకుండా తిరుగుతుండటంతో కుటుంబ సభ్యులు మందలించారు. మనస్థాపం చెందిన జోగు రవి మే 25న పొలముకు వెళుతున్నానని తల్లిదండ్రులకు చెప్పి ఇంటి నుంచి వెళ్ళాడు. సాయంత్రం వరకు ఇంటికి తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు పలుమార్లు పోన్ చేసినప్పటికి స్పందించలేదు. దీంతో అతని సోదరుడు అనంతయ్య, బంధువు శ్రీకాంత్‌తో కలిసి చేనుకు వెళ్ళి వెతకగా జోగు రవి గుర్తు తెలియని పురుగుల మందు సేవించి అపస్మారక స్థితిలో పడి ఉన్నాడు. వెంటనే అతడిని తాండూరు జిల్లా ఆసుపత్రికి తరలించగా, అక్కడి నుంచి మెరుగైన చికిత్స నిమిత్తం వికారాబాద్ మిషన్ అసుపత్రికి, అనంతరం పరిస్తితి విషమించడంతో హైద్రాబాద్ పంజగుట్టలోని నీమ్స్ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతు శనివారం తెల్లవారుజామున జోగు రవి మృతిచెందాడు. మృతుని అన్న జోగు రాములు ఇచ్చిన పిర్యాదు మేరకు కేసునమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టినట్లు ఎస్ఐ తెలిపారు.

## పరిగి మున్సిపల్ కమిషనర్‌గా మల్లేష్

**పరిగి,మే 31, ప్రభాతవార:** వికారాబాద్ జిల్లా పరిగి మున్సిపల్ కమిషనర్ గా బదిలీపై వచ్చిన కె.మల్లేష్,ఆదివారం హైదరాబాద్ లోని పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు.పరిగి మున్సిపల్ కమిషనర్ గా విధులు నిర్వహిస్తున్న వెంకటయ్య జి.హెచ్.ఎమ్.సి కి బదిలీ అయ్యారు.ఈ సందర్భంగా పరిగి మున్సిపాలిటి అభివద్ధికి,పరిగి ప్రాంత ప్రజలకు మెరుగైన పౌర సేవలను అందజేయాలని ఎమ్మెల్యే రాంమోహన్‌రెడ్డి సూచించారు.పట్టణ అభివద్ధికి సంబందించిన పలు అంశాలపై చర్చించారు.


ఎమ్మెల్యే రాంమోహన్‌రెడ్డిని కలిసిన కమీషనర్ మల్లేశ్



## కౌడీడ్ గ్రామ శివారులో పేకాట రాయుళ్ల గుట్టురట్టు

-నలుగురు జూదరుల అరెస్ట్..

-రూ.4,100 నగదు స్వాధీనం చేసుకున్న దౌల్తాబాద్ పోలీసులు

**దౌల్తాబాద్,మే 31,ప్రభాతవార్త:**

వికారాబాద్ జిల్లా కొడంగల్ నియోజకవర్గం దౌల్తాబాద్ మండలంలోని కౌడీడ్ గ్రామంలో గుట్టుచప్పుడు కాకుండా సాగుతున్న పేకాట స్థావరంపై పోలీసులు మెరుపు దాడి చేశారు.గ్రామ శివారులో కొంతమంది వ్యక్తులు జూదం(పేకాట) ఆడుతున్నారనే నమ్మదగిన సమాచారం అందుకున్న దౌల్తాబాద్ ఎస్ఐ వేణుకుమార్,తమ సిబ్బందితో కలిసి ఆదివారం ఆకస్మిక తనిఖీలు చేపట్టారు.ఈ దాడిలో నిబంధనలనపు ఉల్లంఘించి పేకాట ఆడుతున్న నలుగురు వ్యక్తులను పోలీసులు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు.నిందితుల నుంచి రూ.4,100 నగదుతో పాటు పేక ముక్కలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.పట్టుబడిన నలుగురు వ్యక్తులపై చట్టప్రకారం కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్ఐ వేణు కుమార్ మీడియాకు తెలిపారు.మండలంలో చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే ఎంతటి వారైనా సహించేది లేదని,శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు.ఈ మెరుపు దాడిలో ఎస్ఐతో పాటు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# ఎంపి ఈటలపై దుష్ప్రచారం చేస్తే సహించేది లేదు

మాజీ జిల్లా అధ్యక్షుడు విక్రమ్ రెడ్డి హెచ్చరిక

**మేడ్చల్, మే 31, ప్రభాతవార్త :** మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్‌పై అసత్య ప్రచారాలు, రాజకీయ కుట్రలు చేసే వారిని బీజేపీ శ్రేణులు ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షి ంచరని మేడ్చల్ జిల్లా బీజేపీ మాజీ అధ్యక్షుడు విక్రమ్ రెడ్డి స్పష్టం చేశారు. ఎంపీ ఈటల రాజేందర్‌ను లక్ష్యంగా చేసుకుని నియోజకవర్గంలో ఏర్పాటు చేసిన వివాదాస్పద ఫ్లెక్సీల వ్యవహారంపై విక్రంరెడ్డి తీవ్రస్థాయిలో స్పందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఎంపీ ఈటల రాజేందర్ ప్రజాదరణను చూసి ఓర్వలేక కొందరు కావాలనే దుష్ప్రచారానికి తెరలేపుతున్నారని అన్నారు. ప్రజల్లో తిరిగి రాజకీయాలు చేసే ధైర్యం లేని వారు రాత్రి వేళల్లో ఫ్లెక్సీలు ఏర్పాటు చేసి చౌకబారు రాజకీయాలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. ఇలాంటి చర్యలకు పాల్పడుతున్న వారంతా ప్రజల్లో ఎదుర్కోలేక చీకటి రాజకీయాలకు పాల్పడుతున్నారని మండిపడ్డారు. ఇలాంటి పనులు చేసే వారు ఎంతటి వారైనా బీజేపీ కార్యకర్తలు చూస్తూ ఊరుకోరని హెచ్చరించారు. ఈటల రాజేందర్ తెలంగాణ ఉద్యమం నుంచి ప్రజా సమస్యల వరకు నిరంతరం పోరాడిన నాయకుడని, అలాంటి వ్యక్తిపై నిరాధార ఆరోపణలు చేయడం వెనుక రాజకీయ దురుద్దేశమే కనిపిస్తోందని పేర్కొన్నారు. ప్రజల్లో ఆదరణ కోల్పోయిన నాయకులు ఇలాంటి కుట్రల రాజకీయాలకు తెరలేపుతున్నారని, ప్రజల కోసం పనిచేస్తున్న నాయకుడిని విమర్శలతో దెబ్బతీయాలని చూస్తున్నారని అన్నారు. ఇలాంటి చిల్లర ప్రయత్నాలతో ఈటల రాజేందర్ ఇమేజ్‌ను రవ్వంత కూడా దెబ్బతీయలేరని స్పష్టం చేశారు. దమ్ముంటే బహిరంగంగా మాట్లాడాలని, ఫ్లెక్సీల ద్వారా ఆరోపణలు చేయడం సరైందని కాదని తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. నిజంగా ఆధారాలు ఉంటే, ఆరోపణల్లో నిజం ఉంటే ప్రజల మధ్యకు వచ్చి మాట్లాడాలని, అర్ధరాత్రి వేళల్లో దొంగచాటుగా ఫ్లెక్సీలు ఏర్పాటు చేసి పారిపోవడం రాజకీయ పిరికితనానికి నిదర్శనమని ఆరోపించారు. బీజేపీ దేశంలోనే అత్యంత క్రమశిక్షణ కలిగిన పార్టీ అని, వ్యక్తిగత ప్రయోజనాల కోసం పనిచేసే నాయకులకు ఇక్కడ స్థానం లేదని విక్రమ్ రెడ్డి అన్నారు.



ఎంపి ఈటల నివాసం సమీపంలో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలు

పార్టీలో గందరగోళం సృష్టించాలని, ఎంపీ ఈటల రాజేందర్‌పై అనుమానాలు కలిగించాలని చూస్తున్న వారి పప్పులు ఉడకవు. బీజేపీ కార్యకర్తలు సిద్ధాంతాల కోసం పనిచేస్తారన్నారు. కుట్రలు, కుతంత్రాలతో పార్టీని బలహీనపరచాలనే ప్రయత్నాలు ఎప్పటికీ విజయవంతం కావని, పేర్కొన్నారు. ఈ ఘటన వెనుక ఉన్న అసలు వ్యక్తులను గుర్తించాలని ఇప్పటికే పోలీసులను కోరినట్లు విక్రమ్ రెడ్డి తెలిపారు. ఫ్లెక్సీలు కట్టిన వారిని మాత్రమే కాదని, వారి వెనుక ఉండి ఈ కుట్రను నడిపించిన సూత్రధారులను కూడా బయటపెట్టాలని, చట్టపరంగా వారిపై కఠిన చర్యలు తీసుకునే వరకు బీజేపీ శ్రేణులు పోరాడుతాయని తెలిపారు. ఎవరు ఎంత పెద్ద వారైనా వదిలిపెట్టే ప్రసక్తే లేదని హెచ్చరించారు. ఎంపీ ఈటల రాజేందర్‌పై వ్యక్తిగతంగా లేదా రాజకీయంగా అసత్య ప్రచారాలు కొనసాగిస్తే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి ఉంటుందని ఆయన స్పష్టం చేశారు. ప్రజల తీర్పుతో గెలిచి పార్లమెంట్‌లో మల్కాజ్‌గిరి ప్రజల గొంతుకగా నిలుస్తున్న ఈటల రాజేందర్‌పై బురదజల్లే ప్రయత్నాలు మానుకోవాలని, ఇలాంటి నీచ రాజకీయాలకు పాల్పడే వారికి ప్రజలే తగిన గుణపాఠం చెబుతారని ఘాటుగా వ్యాఖ్యానించారు.

## 'రాళ్లను ఈనుతున్న నేల' కావ్యావిష్కరణ

**పెద్దేముల్, మే 31, ప్రభాతవార్త:** తాండూరు ప్రాంత వైభవం, సంస్కృతి, మరియు అక్కడి చారిత్రక ఆనవాళ్ళ నేపథ్యంతో గాజుల పవన్ కుమార్ రచించిన 'రాళ్లను ఈనుతున్న నేల' అనే కావ్యం ఆదివారం ఘనంగా ఆవిష్కరించబడింది. పెద్దేముల్ మండల కేంద్రంలోని స్థానిక కట్టమైసమ్మ దేవాలయంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన డాక్టర్ టి. వరలక్ష్మి పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. తాండూరు పుడమి గర్భం నుండి ఉద్భవించిన రత్నాల లాంటి రాళ్ళను కవి వినూత్నంగా అభివర్ణించారని కొనియాడారు. మాతృభూమి వైభవాన్ని అణువణువునా అవలోకనం చేయడం కవికి తన నేలపై ఉన్న ప్రగాఢ భక్తికి నిదర్శనమని ఆమె పేర్కొన్నారు. కార్యక్రమంలో అతిథులుగా పాల్గొన్న సిహెచ్. నారాయణరెడ్డి, మడపతి సిద్ధలింగయ్య, ద్యావరి నరేందర్‌రెడ్డిలు మాట్లాడుతూ.. తాండూరు రాళ్ళగనుల చరిత్ర, కాగ్నానది ప్రత్యేకత, కందిపప్పు కమ్మదనంతో పాటు ఊరిలోని పలు చారిత్రక కట్టడాలను ఈ పుస్తకంలో వ్యక్తీకరించిన తీరు పాఠకుల్లో ఎంతో ఆసక్తిని కలిగిస్తుందని అన్నారు. రచయిత గాజుల పవన్ కుమార్ ఈ కావ్యాన్ని తన తల్లిదండ్రులైన గాజుల బస్వరాజ్, చంద్రకళలకు అంకితమిచ్చారు. తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ సంచాలకులు డాక్టర్ ఏనుగు నర్సింహారెడ్డి, ప్రముఖ రచయిత దోరవేటి ఈ పుస్తకానికి ముందుమాటలు రాశారు. కులాలు, మతాలు, ప్రాంతాలకు అతీతంగా పుట్టిన ఊరిని ప్రేమించే తత్వం, పాఠకుల్లో మంచి స్ఫూర్తిని, స్వాభిమానాన్ని పెంపొందించే శక్తి ఈ పుస్తకం నిండా కనిపిస్తుందని వారు తమ ముందుమాటల్లో అభినందించారు. ఈ ఆవిష్కరణ కార్యక్రమంలో కోస్గి తిప్పయ్య, విజయకుమార్, నరహరి తదితరులు పాల్గొన్నారు.

## సర్వీసింగ్ సెంటర్ నుంచి బుల్లెట్ చోరీ

**రంగారెడ్డి అర్బన్, మే 31 ప్రభాతవార్త:**

శంషాబాద్ పట్టణంలో పట్టపగలు రాయల్ ఎన్ఫీల్డ్ సర్వీసింగ్ సెంటర్‌లో నుంచి బుల్లెట్ మోటార్‌సైకిల్ చోరీకి గురైన ఘటన కలకలం రేపింది. సిబ్బంది భోజన విరామంలో ఉండటాన్ని ఆసరాగా చేసుకున్న ఓ గుర్తు తెలియని వ్యక్తి చాకచక్యంగా బైక్‌ను అపహరించుకుని పరారయ్యాడు. ఈ ఘటన శంషాబాద్ ఎయిర్‌పోర్ట్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకోగా, ఆదివారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది.

పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. శంషాబాద్‌లోని మధురానగర్ ప్రాంతంలో ఉన్న రాయల్ ఎన్ఫీల్డ్ సర్వీసింగ్ సెంటర్‌కు శనివారం మధ్యాహ్నం ఓ యువకుడు వచ్చాడు. అక్కడ పార్కింగ్‌లో ఉన్న బైక్‌లను పరిశీలిస్తున్నట్లు నటిస్తూ కొంతసేపు సెంటర్‌లో తిరిగాడు. అదే సమయంలో సిబ్బంది భోజనానికి వెళ్లడంతో పరిస్థితిని గమనించిన అతడు, సర్వీసింగ్‌కు వచ్చిన రాయల్ ఎన్ఫీల్డ్ బుల్లెట్ బైక్‌ను తీసుకుని అక్కడి నుంచి ఉడాయించాడు.

కొంతసేపటి తర్వాత బైక్ కనిపించకపోవడంతో సిబ్బంది ఆందోళనకు గురై చుట్టుపక్కల వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో వెంటనే శంషాబాద్ ఎయిర్‌పోర్ట్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన పోలీసులు సర్వీసింగ్ సెంటర్‌తో పాటు పరిసర ప్రాంతాల్లోని సిసిటివి కెమెరాల ఫుటేజీలను పరిశీలిస్తున్నారు. నిందితుడి కదలికలను గుర్తించే పనిలో పోలీసులు నిమగ్నమయ్యారు. సిసిటివి దృశ్యాల ఆధారంగా నిందితుడిని త్వరలోనే గుర్తించి అరెస్ట్ చేస్తామని, దర్యాప్తు కొనసాగుతోందని ఇన్స్పెక్టర్ సంజీవ్ తెలిపారు. ఇటీవల పట్టణ ప్రాంతాల్లో వాహన చోరీలు పెరుగుతున్న నేపథ్యంలో వాహన యజమానులు అప్రమత్తంగా ఉండాలని పోలీసులు సూచించారు.

## క్రీడలు మానసిక ఉల్లాసాన్ని ఇస్తాయి

విజేతలకు బహుమతులు అందజేసిన ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్

**రంగారెడ్డి అర్బన్ మే 31,ప్రభాతవార్త :** క్రీడలు మానసిక ఉల్లాసాని ఇస్తాయని యువత క్రీడారంగంలో రాణించాలని రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ పేర్కొన్నారు. శంషాబాద్ మండల్ పెద్దతూప్రా గ్రామంలోని బొద్దం మహేష్ యాదవ్ ఆధ్వర్యంలో గత మూడు రోజులుగా నిర్వహించిన క్రికెట్ టోర్నమెంట్ ఆదివారం ఘనంగా ముగిసింది. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ ముఖ్య అతిథులు హాజరై విజేతలుగా గెలిచిన జట్టులకు బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ..యువకులలో ఉత్తేజపరిచేటువంటి కార్యక్రమాలను ప్రోత్సహిస్తున్నటువంటి గ్రామస్తులు మరియు బొద్దం మహేష్ యాదవ్ వారిని అభినందించారు.ముందు ముందు ఇంకా జిల్లా, రాష్ట్ర స్థాయిలో ఇట్లాంటి క్రీడా పోటీలను నిర్వహించేందుకు నా వంతు సహకారంగా ఉంటుందని అన్నారు. యువకులు చదువుతోపాటు క్రీడలలో రాణించి తల్లిదండ్రులు, గ్రామానికి మంచి పేరు తీసుకురావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పలువురు నాయకులు, గ్రామస్తులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

## టిడిపి నేత సంజీవరావుకు పరామర్శ


సంజీవరావును పరామర్శిస్తున్న ఘట్‌కేసర్ టిడిపి నాయకులు

**ఘట్‌కేసర్, మే 31, ప్రభాతవార్త:** రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ టిడిపి రాష్ట్ర నాయకులు సంజీవరావును ఘట్‌కేసర్ టిడిపి నాయకులు పరామర్శించారు. యాదాద్రిభువనగిరి జిల్లా బీబీనగర్ మండలం జియాపల్లికి చెందిన జనగాం ఇంచార్జ్ సంజీవరావు బైక్‌పై వెళ్తుండగా అదుపుతప్పి కింద పడటంతో కుడికాలుకి గాయం కాగా చికిత్స పొంది ఇంట్లో ఉంటున్నాడు. ఈమేరకు ఘట్‌కేసర్ టిడిపి నాయకులు వేముల సంజీవగౌడ్, సామల జగన్మోహన్‌రెడ్డి, పాటి సురేందర్‌రెడ్డి, సురుపు సతీష్ తదితరులు సంజీవరావును పరామర్శించారు.


కళ్యాణ మహోత్సవంలో పాల్గొన్న భక్తులు

## ఘనంగా సత్యనారాయణ స్వామి కళ్యాణోత్సవం

**మేడ్చల్, మే 31, ప్రభాతవార్త :** మేడ్చల్ పట్టణంలోని లక్ష్మి గార్డెన్‌లో విష్ణు శౌర్య ఆధ్వర్యంలో వేద పండితులచే సత్యనారాయణ స్వామి కళ్యాణ మహోత్సవం కన్నుల పండువగా జరిగింది. ఈ మహోత్సవంలో దంపతులు, భక్తులు పాల్గొని సంప్రదాయ పద్ధతిలో భక్తి శ్రద్ధలతో పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్న ప్రసాద వితరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విష్ణు శౌర్య మాట్లాడుతూ ప్రతి సంవత్సరం నిర్వహించే కళ్యాణ మహోత్సవానికి విచ్చేస్తున్న భక్తులకు ధన్యవాదాలు తెలుపుతూ స్వామి వారి ఆశీస్సులు అందరిపై ఉండాలని ఆకాంక్షి ంచారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ నియోజకవర్గ బీఆర్ఎస్ ఇంచార్జి మహేందర్ రెడ్డి, మాజీ ఎఫ్‌డిసి చైర్మన్ ప్రతాప్ రెడ్డి, వివిధ పార్టీల నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

## సిపిఆర్ఐ వద్ద డివైడర్ మార్గం ఏర్పాటు చేయండి

-ప్రజాసౌకర్యానికి ప్రాధాన్యత ఇవ్వాలి: వైఎస్ఆర్

**ఘట్‌కేసర్, మే 31, ప్రభాతవార్త:** హైద రాబాద్-భూపాలపట్నం జాతీయరహదారి (163)పై సిపిఐఆర్ఐ వద్ద డివైడర్ ఏర్పాటు చేసి ప్రత్యేక మార్గం నిర్మించాలని బిజెపి రాష్ట్రకార్య వర్గస భ్యులు-ఘట్‌కేసర్ మాజీ ఎంపిపి ఏనుగు సుదర్శన్‌రెడ్డి రోడ్లు భవనాలశాఖ అధికారులను కోరారు. ఈమేరకు ఆయన ఆర్‌అండ్‌బి చీఫ్ ఇంజనీర్ పి.ధర్మారెడ్డి, ఈఈ వి.ప్రకాష్‌లను కలిసి రహదారిపై సమస్యలను వివరించి తగిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఉప్పల్ నుంచి నారపల్లి వరకు నిర్మిస్తున్న ఎలివేటెడ్ కారిడార్‌లో భాగంగా వంతెన మొదలయ్యే స్థలంలోని సీపీఆర్ఐ వద్ద ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకొని డివైడర్ ఏర్పాటు చేసి మార్గం చేయాలని, స్థానికులు, ఉద్యోగులు, వాహనదారులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను అధికారులు తీర్చాలని కోరారు.


ఆర్‌అండ్‌బి సిఇ ధర్మారెడ్డితో చర్చిస్తున్న మాజీ ఎంపిపి సుదర్శన్‌రెడ్డి

సీపీఆర్ఐ వద్ద డివైడర్ యుటర్న్ ఏర్పాటు చేస్తే స్థానిక కాలనీ ప్రజలకు రాకపోకలకు సులభతం కావడంతో పాటు ట్రాఫిక్ సమస్యలు కూడా గణనీయంగా తగ్గే అవకాశం ఉందని తెలిపారు. ప్రజాప్రయోజనాలను దృష్టిలో ఉంచుకొని ఈప్రతిపాదనను సానుకూలంగా పరిశీలిస్తామని సీఈ హామీ ఇచ్చారని నియోజకవర్గ ప్రజల సమస్యల పరిష్కారమే తన లక్ష్యమని ఏసమస్య వచ్చినా సంబంధిత అధికారులతో చర్చించి పరిష్కరించేందుకు కృషి చేస్తున్నామని సుదర్శన్‌రెడ్డి పేర్కొన్నారు. ఆయన వెంట మేడ్చల్ రూరల్ జిల్లా యువమోర్చ అధ్యక్షులు బండారు పవన్‌రెడ్డి ఉన్నారు.

## మతోన్మాద, మోసపూరిత విధానాలపై పోరాడాలి

-ఘట్‌కేసర్‌లో సిపిఎం శిక్షణా తరగతులు

**ఘట్‌కేసర్, మే 31, ప్రభాతవార్త:** దేశ సమైక్యతలకు బిజెపి విధానాలతో ప్రమాదం పొంచి ఉందని మోసపూరిత మోదీ విధానాలు కార్పొరేట్లకు వరాలు కురిపిస్తూ కష్టజీవులపై భారాలు మోపుతున్నాయని మతోన్మాద విధానాలపై మహోద్యమం నిర్మించాలని సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు టి.స్కైలాబ్‌బాబు పిలుపునిచ్చారు. ఘట్‌కేసర్‌లో సీపీఎం మండల స్థాయి రాజకీయ శిక్షణా తరగతులలో భాగంగా రెండోరోజు ఆయన హాజరై మతం మతోన్మాదం అనే అంశంపై క్లాస్ బోధించారు. తరగతులకు సీపీఎం మండల కార్యదర్శి ఎన్.సభిత ప్రిన్సిపాల్‌గా వ్యవహరించారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ సిపిఎం అనేక పోరాటాలు నిర్మిస్తుందని, భవిష్యత్తులో సీపీఎం చేపట్టబోయే ఉద్యమాలలో ప్రజలు ప్రత్యక్షంగా భాగస్వాములు కావాలని ఆయన పిలుపునిచ్చారు. ఈతరగతుల్లో సీపీఎం విశిష్టత పని పద్దతులు అనే అంశంపై సీపీఎం రాష్ట్ర కమిటటి సభ్యులు బుర్రి ప్రసాద్ క్లాసు భోధించారు.

ఈశిక్షణ తరగతుల్లో సీపీఎం సీనియర్ నాయకులు చింతల యాదయ్య, ఐద్వా జిల్లా అధ్యక్షురాలు సృజన, సిపిఎం మండల కమిటటీ సభ్యులు కడమంచి యాదగిరి, కె.అలివేలు, జి.నాగమణి, చల్లగొండ అరుణ, ప్రేమలత, డి.పోచయ్య, శ్రీను, కె.బలరాం, ఎన్.లక్ష్మయ్య, డి.జ్యోతి, ఎన్.భవాని లలిత, క్రాంతికుమార్, శ్రావణి, లక్ష్మయ్య, కె.రాజిరెడ్డి, కె.శోభ, స్వప్న, శ్రీరాములు, సమత, ఐశ్వర్య, ఎల్లమ్మ, రాకేష్, లలిత తదితరులు పాల్గొన్నారు.



శిక్షణ తరగతుల్లో మాట్లాడుతున్న సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు స్కైలాబ్‌బాబు

## 2న మహనీయుల చైతన్య బస్సుయాత్ర

**తలకొండపల్లి, మే 31, ప్రభాతవార్త:** రంగారెడ్డి జిల్లా పరిధిలోనీ కడ్తాల్ మండలలోని మైసిగండి గ్రామములో ఈనెల 2న మహనీయుల చైతన్య బసుయాత్ర ప్రారంభిస్తున్నట్లు జిల్లా కో ఆర్డినేటర్, జి. సుధ సుధాకర్ తెలిపారు. ఆదివారం తలకుండపల్లి మండల కేంద్రంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో బస్ యాత్ర కరపత్రం విడుదల చేశారు. ఈ సందర్భాంగా అయిన మాట్లాడుతూ నాగర్‌కర్నూల్ పార్లమంటు పరిధిలోని అన్ని మండల కేంద్రాలతోపాటు సుమారు 1000 గ్రామాలలో ఈ యాత్ర నిర్వహిస్తామని వివరించారు. దేశంలోని దళిత బహుజన మహనీయుల చరిత్రలు, రాజ్యంగంపై అవగాహన, సామాజిక న్యాయం, స్వేఛ్ఛ, ఓటు చైతన్యం, తదితర విషయాలపై ప్రజలకు వివరిస్తామని తెలిపారు. ఈకార్యాక్రమానికి నాగర్ కర్నూల్ పార్లమెంటు సభ్యులు డాక్టర్ మల్లు రవి, కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి ముఖ్య అతిథులుగా పాల్గొంటారని చెప్పారు. కులం, మతం పేరుతో పరిపాలన కాకుండా రాజ్యాంగాన్ని కాపాడే విధంగా ప్రజాస్వామ్య యుతంగా ఉండేందుకు ప్రజలకు తెలియజేసి మేల్కొల్పుతామన్నారు. ఆట, పాట లతో సమావేశాలు సభలతో తెలియజేస్తామన్నారు. ఈ కార్యక్రమానికి మేధావులు, విద్యావేత్తలు, యువకులు, ప్రజాస్వామిక వాదులు పాల్గొంటారన్నారని చెప్పారు. ఈ కార్యక్రమములో జి.సుధాకర్ కోఆర్డినేటర్, ఎంపిపి రఘురాములు, మాజీ ఎంపిటిసి జోగు రమేష్, కూర్మ సంఘం జిల్లా నాయకుడు వెంకయ్య, శ్రీశైలం తది తరులు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

**కేశంపేట, మే 31, ప్రభాతవార్త:** మానవత్వం చాటిన కాంగ్రెస్ పార్టీ కేశంపేట మండల అధ్యక్షుడు రమేష్. ఆదివారం మధ్యాహ్నం జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడి అపస్మారక స్థితిలో రోడ్డుపై పడి ఉన్న వ్యక్తికి సకాలంలో సహాయం అందించిన కేశంపేట మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు అనుమగల్ల రమేష్ మానవత్వాన్ని చాటారు. తలకొండపల్లి మండలం కాటన్ మిల్ సమీపంలో ప్రమాదానికి గురై గాయపడిన వ్యక్తిని గమనించిన రమేష్ వెంటనే స్పందించి అంబులెన్స్‌కు సమాచారం అందించారు. అనంతరం బాధితుడిని ఆసుపత్రికి తరలించి వైద్య చికిత్స అందేలా చర్యలు తీసుకున్నారు. గాయపడిన వ్యక్తి కొత్తూరు మండలం ఇముల్ నర్వ గ్రామానికి చెందినవాడిగా గుర్తించారు. సమయానికి స్పందించి ప్రాణాపాయ స్థితిలో ఉన్న వ్యక్తికి అండగా నిలవడంతో స్థానికులు రమేష్‌ను అభినందించారు.

## ఇండియన్ ఆర్మీకి డిగ్రీ విద్యార్థుల ఎంపిక

**కొడంగల్, మే 31 ప్రభాతవార్త:** కొడంగల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు చెందిన ఇద్దరు విద్యార్థులు ఇండియన్ ఆర్మీకి ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ డా.బి.శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. డిగ్రీ కళాశాలలో బిఎస్సీ ఎం.పి.సి.ఎస్ తృతీయ సంవత్సరం చదువుతున్న నెనావత్ శ్రీనివాస్‌నాయక్, బి.ఎ.హెచ్.ఇ.పి ద్వితీయ సంవత్సరం చదువుతున్న జి.హరిక్రిష్ణ ఆదివారం వెలువడిన ఇండియన్ ఆర్మీ ఫలితాల్లో ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ ఒక ప్రకటలో తెలిపారు. గ్రామీణ ప్రాంతం నుండి వచ్చిన ఇద్దరూ ఎంతో కష్టపడి చదివి ఆకాడమిక్స్‌లో కూడా బాగా రాణించే వారని తెలిపారు. తమ కళాశాల విద్యార్థులు దేశ రక్షణలో భాగస్వాములు కావడం తమకెంతో గర్వకారణమని ప్రిన్సిపాల్ తెలిపారు. ఈ సందర్భంగా ఇండియన్ ఆర్మీకి ఎంపికైన ఇద్దరు విద్యార్థులను ప్రిన్సిపాల్,కళాశాల సిబ్బంది అభినందించారు.

## ప్రమాదకరంగా బి సి కాలనీ ట్రాన్సఫార్మర్

రక్షణ చర్యలు చేపట్టని అధికారులు

భయాందోళనలు ప్రజలు

**తలకొండపల్లి మే31, ప్రభాత వార్త;**

రక్షణ లేని ట్రాన్సఫార్మర్లతో ప్రమాదం పొంచి ఉంది. ముఖ్యంగా , ఇళ్ల సమీపంలో, రహదారుల వెంట ఏర్పాటు చేసిన ట్రాన్సఫార్మర్లు ప్రమాదకరంగా మారాయి. రంగారెడ్డి జిల్లా తలకొండపల్లి మండలం వెల్జాల్ గ్రామంలోని బి సి కాలనీ 1వ వార్డులో నివాసాల మధ్య ఉన్న విద్యుత్ ట్రాన్స్ఫర్మర్ ప్రమాదకరంగా మారింది.పట్టించుకోవాల్సి న అధికారులు నిమ్మకు నీరెత్తినట్లుగా వ్యవహరిస్తుండటంతో ఆయా దారిలో వెళ్లే ప్రజలు, చిన్నారులు భయాందోళనకు గురవుతున్నారు. కాలనీలో రోజు రోజుకు పెరుగుతున్న విద్యుత వినియోగదారుల సంఖ్యకు అనుగుణంగా విద్యుత లైనల విస్తర ణ కూడా జరగుతోంది.అయితే తదనుగుణంగా విద్యుత సరఫరాలో ఎ లాంటి అవాంతరాలు తలత్తెకుండా అదనపు ట్రాన్సఫార్మర్లు కూడా ఏర్పాటు చేస్తున్నారు. ఇం త వరకు బాగానే ఉన్నా ట్రాన్సఫార్మర్ల ఏర్పాటు చేసే సమయంలో తీసుకోవాల్సిన కనీస నిబంధనలను కాంట్రాక్టర్లు మరిచిపోతున్నారు.పనుల ను పర్యవేక్షి ంచాల్సిన అధికారులు సైతం చూసి చూడనట్లుగా వ్యవరిస్తుండటంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుంది. ట్రాన్స్ఫర్మర్ పై పత్రికలలో ఎన్ని కథనాలు వచ్చినా స్పందించని అధికార యంత్రాగం,రానున్నది వర్షాకాలం కాబట్టి ఇప్పటికైనా జాగ్రత్తలు తీసుకోవాలని వాసులు ఆందోళన చెందుతున్నారు.

## "పూర్వ" విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం..


ఉపాధ్యాయులతో 2005-06 ఎస్సెస్సి బ్యాచ్ విద్యార్థులు..

**దుద్యాల్, మే 31, ప్రభాతవార్త:** మండల పరిధిలోని హకీంపేట్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2005-06 బ్యాచ్ విద్యార్థులు ఆదివారం ఆత్మీయ పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఏర్పాటు చేసుకుని అందరు మళ్లి కలుకున్నారు. ఈ సందర్భంగా కోస్గిలోని ఓ ఫంక్షన్ హాల్ లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు.

నాడు భోదించిన ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. అలాగే ప్రస్తుతం వారు స్థిరపడ్డ రంగాలను ఒకరికొకరు తెలుపుకుని సంతోషంతో గడిపారు. చాలా సంవత్సరాల తర్వాత ఆందరం స్నేహితులము కలవడం చాలా ఆనందంగా ఉందన్నారు. ఉపాధ్యాయులు రాజ్యలక్ష్మి మాణిక్య ప్రభు, దత్తు రావు, లావణ్య, విద్యాసాగర్, జయప్రకాష్ గౌడ్, వేణుగోపాల్, రాజ్యవర్ధన్ రెడ్డి, చంద్రశేఖర్, బాలు పూర్వ విద్యార్థులు వీరేశం, రవి నాయక్, మల్లికార్జున్, సురేష్, వెంకటేష్, బాలరాజ్, రవి నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## పోలేపల్లి రేణుక ఎల్లమ్మ దేవాలయ ఈవోగా శాంత కుమార్

**దుద్యాల్, మే 31, ప్రభాతవార్త:** మండల పరిధిలోని ప్రసిద్ధిగాంచిన పోలేపల్లి రేణుక ఎల్లమ్మ దేవాలయం నూతన ఈవోగా శాంత కుమార్ బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ ఈవోగా విధులు నిర్వహిస్తున్న రాజేందర్ రెడ్డి హుండీ లెక్కింపులో అవకతవకలకు పాల్పడడంతో అరెస్టు చేసి రిమాండ్ కు తరలించారు.

ఆయన స్థానంలో మర్పల్లి మండలం భూచన్ పల్లి సంగమేశ్వర స్వామి దేవాలయంలో ఈవోగా విధులు నిర్వహిస్తున్న శాంత కుమార్ కు రేణుకా ఎల్లమ్మ దేవాలయం ఈవోగా దేవాదాయ శాఖ అదనపు బాధ్యతలు అప్పగించింది. శాంత కుమార్ మాట్లాడుతూ., ఆలయ అభివృద్ధికి కృషి చేస్తూ, భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా పర్యవేక్షి స్తూ అందుబాటులో ఉంటానని తెలిపారు.

## మృతుని కుటుంబానికి ఆర్థిక సాయం

**దుద్యాల్, మే 31, ప్రభాతవార్త:** మండల పరిధిలోని లగచర్ల గ్రామానికి చెందిన బంక మల్లయ్య అనారోగ్యంతో మరణించడంతో గ్రామ సర్పంచ్ వెంకట్ రాములు గౌడ్ రూ. 5000 ఆర్థిక సాయం అందజేశారు. ఆయనతోపాటు మండల యాదవ సంఘం అధ్యక్షులు కావలి నరసింహులు, శ్రీనివాస్, లక్ష్మయ్య, రామాంజనేయులు, యాదయ్య, వెంకటయ్య, అరవింద్ తదితరులు ఉన్నారు.

# 12 నుంచి మోగనున్న బడి గంట

* గ్రేటర్‌లో 1,742 బడి బస్సులు ఫిట్‌లెస్
* సామర్థ్యం లేనివాటిపై రవాణా శాఖ కొరడా
* జూన్ 12న తెరుచుకోనున్న విద్యా సంస్థలు




**హైదరాబాద్, మే 31, ప్రభాతవార్త**

బడులు తిరిగి తెరుచుకునేనాటికి సామర్థ్యం ఉన్న బస్సులను అందుబాటులో ఉంచాలనే నిబంధన ఉంది. మరో 11 రోజుల్లో బడిగంట మోగనున్న నేపథ్యంలో పూర్తిస్థాయిలో స్కూల్ బస్సులు ఫిట్‌నెస్‌కు రాకపోవడం గమనార్హం. ఏటా మే 15వ తేదీ నుంచి బస్సుల సామర్థ్య పరీక్షలు కొనసాగుతాయి. ఆ రోజు నుంచి జూన్ మొదటి వారం వరకు రవాణా అధికారులు పరీక్షలు నిర్వహించి వాటి సామర్థ్యాన్ని నిర్ధారించిన తర్వాతే పిల్లలకు రవాణా సదుపాయాన్ని అందజేసేందుకు ఆ బస్సులకు అనుమతి లభిస్తుంది. కానీ.. విద్యాసంస్థల నిర్లక్ష్యం కారణంగా సగానికి పైగా పెండింగ్ ఉన్నాయి. మరోవైపు పిల్లల భద్రతను దృష్టిలో ఉంచుకొని ప్రత్యేక తనిఖీలను నిర్వహించేందుకు రవాణాశాఖ సన్నద్ధమవుతోంది. గ్రేటర్‌లోని స్కూళ్లు, కాలేజీలు, తదితర విద్యాసంస్థల యాజమాన్యాలతో రవాణా మంత్రి పొన్నం ప్రభాకర్ త్వరలో సమావేశం కానున్నారు. బస్సుల భద్రతపైన ఆయన స్వయంగా దిశానిర్దేశం చేస్తారని రవాణాశాఖ అధికారులు పేర్కొంటున్నారు. నిర్ణీత గడువులోగా ఫిటెనెస్ పరీక్షలకు హాజరు కాని బస్సులపైన కఠిన చర్యలు తీసుకోనున్నట్లు చెప్పారు. ఆర్టీఏ లెక్కల ప్రకారం గ్రేటర్‌లోని మూడు జిల్లాలపరిధిలో మొత్తం 13.562 బడి బస్సులు ఉండగా, ఇప్పటివరకు 11,820 బస్సులకు ఫిట్‌నెస్ పరీక్షలు పూర్తయ్యాయి. వీటికి ఫిట్‌నెస్ పరీక్షలు నిర్వహించి సర్టిఫికెట్లు ఇచ్చినట్లు అధికారులు తెలిపారు.

**నిబంధనలు ఉల్లంఘిస్తే బస్సులు సీజ్...**

పిల్లలను భద్రంగా స్కూళ్లకు తీసుకెళ్లి, తిరిగి ఇంటికి తీసుకురావడంలో స్కూల్ బస్సుల నిర్వహణ ఎంతో కీలకమైది. కానీ అనుభవం లేని డ్రైవర్ల పనితీరు, రాష్ డ్రైవింగ్, బస్సుల నిర్వహణ వైఫల్యాలు తదితర కారణాలతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. కొందరు డ్రైవర్‌లు వాహనాలు నడిపేసమయంలో సరైన జాగ్రత్తలు పాటించకపోవడంతో పిల్లలు బస్సు చక్రాలం కింద నలిగిపోతున్నారు. దీంతో స్కూల్ బస్సుల నిర్వహణను. రవాణాశాఖ సున్నితమైన అంశంగా గుర్తించి నిబంధనలను, ప్రమాణాలను రూపొందించింది. ఈ ప్రమాణాలను ఉల్లంఘించే బస్సులను ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షి ంచబోమని, పర్మిట్‌లు రద్దు చేయడంతో పాటు బస్సులను జప్తు చేయనున్నట్లు జేటీసీ రమేష్ హెచ్చరించారు.

**ఈ నిబంధనలు తప్పనిసరి...**

బస్సు కేవలం పసుపు రంగులో ఉండాలి. విద్యార్థులు బస్సులోకి ఎక్కడం, దిగడం డ్రైవర్‌కు స్పష్టంగా కనిపించే విధంగా కన్వెక్స్ క్రాస్ వ్యూ అద్దాలు అమర్చాలి. బస్సు లోపలి భాగంలో ఒక పెద్ద పారదర్శకమైన అద్దం ఏర్పాటు చేయాలి. బస్సు ఇంజిన్ కంపార్ట్‌మెంట్‌లో అగ్ని మాపక యంత్రం, పొడి అందుబాటులో ఉండాలి. ఫస్ట్ ఎయిడ్ బాక్స్ తప్పనిసరి. పాఠశాల, కళాశాల పేరు, టెలిఫోన్ నంబర్, మొబైల్ నంబర్, పూర్తి చిరునామా బస్సుకు. ఎడమ వైపున ముందు భాగంలో స్పష్టంగా రాయాలి. వాహనానికి స్కూల్ బస్సు, లేదా కళాశాల బస్సు అని నల్ల రంగులో కనీసం 100 ఎంఎం సైజు అక్షరాలతో రాయాలి. బస్సు తలుపులు సురక్షి తమైన లాగింగ్ సిస్టమ్‌తో ఉండాలి. సీటింగ్ సామర్థం కంటే ఎక్కువ మందిని తీసుకెళ్లకూడదు. ఫుట్‌బోర్డ్‌పై మొదటి మెట్టు 325 ఎంఎం ఎత్తుకు మించకుండా ఉండాలి. అన్ని మెట్లు జారకుండా ఉండే లోహంతో అమర్చాలి. లోపలికి ఎక్కేటప్పుడు, దిగేటప్పుడు పట్టుకొనేందుకు వీలుగా ముందరి తలుపు మెట్లకు సమాంతరంగా రెయిలింగ్ ఉండాలి. బస్సులో ప్రయాణించే విద్యార్థుల పేర్లు, తరగతులు, ఇళ్ల చిరునామాలు, ఎక్కాల్సిన, దిగాల్సిన వివరాలు బస్సులో ఏర్పాటు చేయాలి.

# రాష్ట్ర వ్యాప్తంగా ఘనంగా టిజెఎఫ్ రజతోత్సవాలు

**సైఫాబాద్, మే 31 (ప్రభాతవార్త):** పోరాడి సాధించుకున్న తెలంగాణ రాష్ట్రం లో 12 ఏళ్ల తరువాత మళ్లీ తెలంగాణ అస్తిత్వాన్ని దెబ్బతీసే కుట్రలు జరుగు తున్నాయని టిజెఎఫ్ అధ్యక్షుడు, ప్రముఖ సంపాదకులు అల్లం నారాయణ మండిపడ్డారు. తెలంగాణ కోసం తెలంగాణ జర్నలిస్టులు అనే నినాదంతో పురుడు పోసుకున్న తెలంగాణ జర్నలిస్టుల ఫోరం రజతోత్సవాలు ముగింపు కార్యక్రమం ఆదివారం సాయంత్రం హైదరాబాద్ నగరంతోపాటు అన్ని జిల్లా ల్లో ఘనంగా టిజెఎఫ్ ఆధ్వర్యంలో జరిగింది. నగరంలోని గన్‌పార్కు స్థూపం వద్ద జర్నలిస్టులు అమరుల త్యాగాలను గుర్తుచేసుకుంటూ నివాళులర్పించారు. తెలంగాణ పునర్నిర్మాణంలో తెలంగాణ జర్నలిస్టులుగా పునరంకితమవుతా మని ప్రతిన బూనారు. ఈ సందర్భంగా అల్లం నారాయణ మాట్లాడుతూ ఉమ్మడి రాష్ట్రం విడిపోయి రెండు రాష్ట్రాలుగా ఏర్పడ్డ తరువాత 12 ఏళ్ల అనంతరం ఆంధ్ర నేతల విగ్రహాలను తెలంగాణ రాజధాని హైదరాబాద్‌లో పెట్టడంలో ఆంతర్యం ఏమిటని ప్రశ్నించారు. ఎపిలో సమైక్యవాదుల కుట్రలకు వ్యతిరేకం గా తెలంగాణ ప్రజలను చైతన్యవంతం చేసిన సంస్థ తెలంగాణ జర్నలిస్టుల ఫోరం అని చెప్పారు. మరోసారి తమ పాత్రను పోషించాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. 2001 మే 31న పట్టుదలని పది మందితో స్వరాష్ట్ర ఆకాంక్ష కోసం కలం యోధులుగా పోరాడాలని సంకల్పించి 25 సంవత్సరాలు పూర్తైన తరువాత నేడు రజతోత్సవాలు ముగింపు కార్యక్రమాన్ని నిర్వహించు కోవడం గొప్ప విషయమన్నారు. ఈ కార్యక్రమాన్ని నిర్వహించడం ద్వారా తెలంగాణ ఉద్యమంలో జర్నలిస్టుల పాత్రను మరోసారి ఈ సమాజం ముందు గర్వంగా ఉంచిన వాళ్లం అవుతామన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే క్రాంతికిరణ్, జర్నలిస్టులు రమణకుమార్, కందుకూరి రమేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

# నగరంలో ఐపిఎల్ ఫైనల్ మ్యాచ్ ఫీవర్!

**ఉప్పల్, మే 31 (ప్రభాతవార్త) :** రాయల్ చాలెంజర్స్ బెంగుళూరు, గుజరాత్ టైటాన్స్ జట్ల మధ్య జరుగుతున్న ఐపిఎల్ ఫైనల్ మ్యాచ్ ఫీవర్ నగరాన్ని తాకింది. నగరంలోని పలుచోట్ల దుకాణాలు, ఈవెంట్ సంస్థలు, పబ్‌లు, బార్ల వద్ద భారీ స్క్రీన్‌లు ఏర్పాటు చేసి క్రికెట్ మ్యాచ్ ప్రదర్శించారు. రాయల్ చాలెంజర్స్ బెంగళూరు, గుజరాత్ టైటాన్స్ జట్ల మధ్య జరుగుతున్న ఈ మ్యాచ్ ఎంతో ఆసక్తికరంగా మారింది. ఈ ఏడాది ఐపీఎల్ సీజన్ విజేతను తేల్చే ఫైనల్ మ్యాచ్ అహ్మదాబాద్ వేదికగా ఆదివారం రాత్రి 7.30 గంటలకు ప్రారంభం అయింది. అహ్మదాబాద్‌లోని నరేంద్ర మోదీ స్టేడియం వేదికగా జరుగుతున్న తుది పోరులో రెండు బలమైన జట్లు ఉండడంతో క్రీడాకారులు ఆసక్తిగా టీవీలకు అతుక్కుపోయారు. ఇటు ప్రిన్స్ సొంత మైదానం కావడం...అటు కింగ్ దూకుడు మీద ఉండటంతో రెండో కప్పు ఎవరి సొంతమవుతుందనేది ఆసక్తి కరంగా మారింది. వీరిద్దరికీ ఇక్కడ అత్యుత్తమ గణాంకాలే ఉన్నాయి. మరీ ముఖ్యంగా నాకౌట్ మ్యాచుల్లో కోహ్లీ, గిల్ ఉత్తమ ఆటతీరు ప్రదర్శించారు. నగరంలోని అన్ని ప్రధాన కూడళ్ల వద్ద క్రికెట్ మ్యాచ్ కారణంగా ట్రాఫిక్ రద్దీ తక్కువగా కనిపించింది. కొందరు క్రికెట్ ప్రేక్షకుల కోసం ప్రత్యేకంగా స్క్రీన్లు ఏర్పాటు చేశారు. కొందరు మద్యం ప్రియుల కోసం కూడా భారీ స్క్రీన్లు ఏర్పాటు చేసి కస్టమర్లను ఆకట్టుకున్నారు.



మరికొన్ని చోట్ల కొందరు ముందుగానే ఫైనల్ మ్యాచ్ చూసేందుకు తమ టేబుళ్లు బుక్ చేసుకోవడం గమన్హారం.

**బోసిపోయిన రహదారులు...**

ఐపిఎల్ ఫైనల్ మ్యాచ్ సందర్భంగా నగరంలో ట్రాఫిక్ రద్దీ తక్కువగా కనిపించింది. ఆదివారం సెలవు దినం కావడం, రాయల్ చాలెంజర్స్ బెంగళూరు, గుజరాత్ టైటాన్స్ జట్ల మధ్య ఫైనల్ మ్యాచ్ జరుగుతుండడంతో కొన్ని చోట్ల జరుగుతున్న ప్రత్యేక ఈవెంట్ల వద్ద మ్యాచ్ చూసేందుకు ముందుగానే తమ సీట్లు రిజర్వు చేసుకున్నారు. మద్యంతోపాటు, మ్యాచ్‌కు కూడా ఎంజాయ్ చేయవచ్చనే కారణంతో పలువురు క్రీడా ప్రేక్షకులు ఈవెంట్ల వైపు మళ్లినట్లు తెలుస్తోంది.

అదేవిధంగా ఐపిఎల్ ఫైనల్ మ్యాచ్ సందర్భంగా పలు చోట్ల బెట్టింగ్‌లు కూడా భారీగా జరిగినట్లు సమాచారం. కొందరు గుట్టు చప్పుడు కాకుండా ఆన్‌లైన్‌లో బెట్టింగ్‌లు నిర్వహిస్తూ దండుకుంటున్నట్లు సమాచారం.

# రసాబాసగా బిఆర్ఎస్ కార్యకర్తల సమావేశం

**వేదికపైనే నేతల ముందే కార్యకర్తల తోపులాట, గందరగోళం.. ఉద్యమకారులను విస్మరిస్తే ఊరుకోం**

**చిక్కడపల్లి, మే 31 (ప్రభాతవార్త):** బిఆర్ఎస్ గోషామహల్ నియోజకవర్గ కార్యకర్తల సమావేశం ఆదివారం తీవ్ర ఉద్రిక్తత, అసంతృప్తి మధ్య రసాభాసగా మారింది. పార్టీ అధిష్ఠానం ఆదేశాల మేరకు ఆదివారం బాగ్ లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో నియోజకవర్గ సమన్వయ, కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సమావేశానికి రాష్ట్ర విద్యా, సంక్షేమ మౌలిక సదుపాయాల అభివృద్ధి సంస్థ పూర్వ చైర్మన్ జి.నాగేందర్ గౌడ్, నియోజకవర్గ ఇంచార్జి ఆర్.వి. మహేందర్ గౌడ్, హైదరాబాద్ పార్లమెంట్ కాంటెస్టెడ్ అభ్యర్థి, పార్టీ సీనియర్ నేత గడ్డం శ్రీనివాస్ యాదవ్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. సమావేశం ప్రారంభమై నేతలు ప్రసంగిస్తున్న తరుణంలో ఒక్కసారిగా నియోజకవర్గానికి చెందిన ముఖ్య కార్యకర్తలు, స్థానిక నాయకులు వేదిక వైపు దూసుకువచ్చారు. వేదికపై ఉన్న ముఖ్య నేతల ముందే పెద్ద ఎత్తున నినాదాలు చేస్తూ తమ ఆగ్రహాన్ని వెళ్లగక్కారు. దీంతో సీనియర్ నాయకులు వారిని సముదాయించే ప్రయత్నం చేసినప్పటికీ కార్యకర్తలు శాంతించలేదు. ఒకరినొకరు తోసు కుంటూ, గట్టిగా వాదించుకోవడంతో హాల్ అంతా గందరగోళంగా మారింది. తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర సాధన కోసం మొదటి నుంచి ప్రాణాలు పణంగా పెట్టి పోరాడిన అసలైన ఉద్యమకారులకు పార్టీలో ఘోర అవమానం జరుగు తోందని కార్యకర్తలు వేదికపై ఉన్న నేతల ఎదుట ఏకరువు పెట్టారు. "పార్టీని నమ్ముకుని ఇన్నేళ్లుగా పనిచేస్తున్న మాకు కనీస గుర్తింపు లేదు. నియోజకవర్గంలో ప్రోటోకాల్ పాటించడం లేదు. కనీసం వేదికపై ప్రముఖుల పక్కన కూర్చునే అర్హత కూడా మాకు లేదా?" అంటూ నిలదీశారు. ఉద్యమ కాలంలో ఎక్కడా లేని వారు ఇప్పుడు వచ్చి పదవులు, ప్రాధాన్యతలు అనుభవిస్తుంటే, జెండా మోసిన తాము మాత్రం వెనుకబడిపోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యకర్తల ఆగ్రహంతో సుందరయ్య విజ్ఞాన కేంద్రం ప్రాంగణం ఉద్రిక్తంగా మారింది. అసమ్మతి నేతలు, కార్యకర్తల ప్రశ్నలకు సమాధానం చెప్పలేక వేదికపై ఉన్న నేతలు ఇరకాటంలో పడ్డారు. అనంతరం నేతలు మాట్లాడుతూ ఆవేదనను సర్దిచెప్పేందుకు ప్రయత్నించినా కూడా ప్రత్యత్నాలు విఫలమయ్యాయి. నియోజకవర్గంలో అంతర్గత విభేదాలు ఈ సమావేశంతో ఒక్కసారి గా బట్టబయలు కావడంతో పార్టీ వర్గాల్లో ఈ రసాభాస చర్చనీయాంశంగా మారింది.



తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవాలకు సిద్ధమవుతున్న పెరేడ్

## రాజేంద్రనగర్‌లో వివాహిత ఆత్మహత్య

**అత్తాపూర్, మే 31 ప్రభాతవార్త :** అత్త, భర్త వేధింపులు భరించలేక ఓ వివాహిత ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన రాజేంద్రనగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం... మృతురాలు భవానీ(26) శ్రీకాంత్‌తో ప్రేమ వివాహం చేసుకుని 2025లో పెద్దల సమక్షంలో వివాహం చేసుకుంది. వివాహం అనంతరం భవానీ అత్త కనకమ్మ తరచుగా మద్యంతాగి ఇంటికివచ్చి ఆమెను దూషిస్తూ కొడుతూ వేధింపులకు గురిచేసేదని కుటుంబ సభ్యులు ఆరోపించారు. ఈ విషయంలో శ్రీకాంత్ తల్లికి మద్దతు వ్యవహరించటంతో భవానీ మానసిక వ్యధకు గురైంది. రెండు రోజుల క్రితం కుటుంబం కార్యక్రమం నిమిత్తం భవానీ, శ్రీకాంత్‌లు స్వగ్రామమైన సిద్దిపేటకు వెళ్లారు. అందరి సమక్షంలో కనకమ్మ, శ్రీకాంత్‌లు భవానీని దూషిస్తూ అవమాన పరిచారు. మే 30వ తేదీన భవానీ తండ్రి ఎల్లయ్యకు ఫోన్‌చేసి భర్త శ్రీకాంత్, అత్త కనకమ్మ వేధిస్తున్నారని, జీవించాలని లేదని ఏడుస్తూ తెలిపింది. అనంతరం ఎవరూ లేని సమయంలో భవానీ ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. తండ్రి ఎల్లయ్య ఫిర్యాదు మేరకు రాజేంద్రనగర్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

### తల్లిదండ్రుల చెంతకు తప్పిపోయిన బాలుడు

**హైదరాబాద్, మే 31 ప్రభాతవార్త :** ఇంటి వద్ద ఆడుకుంటూ కనిపించకుండా పోయిన నాలుగేళ్ల బాలుడిని టప్పాచబుత్రా పోలీసులు గుర్తించి తల్లిదండ్రుల చెంతకు చేర్చారు. మొహమ్మద్ హంజా(4) మే 30వ తేదీ సాయంత్రం ఇంటిబయట ఆడుకుంటూ ఆ తర్వాత కనిపించ లేదు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన పోలీసులు ఘటనా స్థలం పరిసర ప్రాంతాల్లో సీసీ పుటేజీలను పరిశీలించారు. తస్లీమ్ బేగం అనే మహిళ బాలుడితో కలిసి వెళ్తున్న దృశ్యాలు గుర్తించారు. ఆమెను విచారించగా బాలుడు అనుకోకుండా తన వెంట వచ్చాడని, రాత్రి కావడంతో తన వద్దే ఉంచుకుని ఉదయం మసీదు ద్వారా ప్రకటన చేసి కుటుంబ సభ్యులకు అప్పగించాలని భావించినట్లు పోలీసులకు తెలిపింది. దీంతో బాలుడిని తల్లిదండ్రుల చెంతకు చేర్చారు. పోలీసులు వేగంగా స్పందించి బాలుడిని గుర్తించడంపై కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

### ప్రేమ పేరుతో బాలికపై లైంగిక దాడి...నిందితుడు అరెస్టు

**నాచారం, మే 31 ప్రభాతవార్త:** బాలికను ప్రేమపేరుతో లైంగిక దాడికి పాల్పడిన ఒక యువకుడిని నాచారం పోలీసులు అరెస్టుచేసి రిమాండ్‌కు తరలించారు. ఎస్సై.వెంకటయ్య కథనం ప్రకారం... మల్లాపూర్ ఎన్టీఆర్ నగర్ బస్తీకి చెందిన కుర్మ భీమేష్(24) పండ్ల వ్యాపారం చేస్తున్నారు. ఇదిలా ఉండగా మైనర్ బాలిక(15)ను సంవత్సరం క్రితం పరిచయం చేసుకొని ఆమెకు మాయమాటలు చెప్పాడు. తాను పెళ్లి చేసుకుంటానని నమ్మించి ఆమెతో స్నేహంగా ఉంటున్నాడు. ఇదిలా ఉండగా మూడు నెలల క్రితం ఆమెపై పలుమార్లు లైంగిక దాడి చేశాడు. దీంతో ఆమెపై లైంగిక దాడి చేసిన వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని బాధితురాలి తరుపు వారు నాచారం పీఎస్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. సాక్ష్యాదారాలు సేకరించిన పోలీసులు నిందితుడు నేరానికి పాల్పడినట్లు నిర్ధారించుకొని ఆదివారం అతనిని అరెస్టు చేసి న్యాయస్థానం ముందు హాజరు పరిచారు.

### నగల వ్యాపారిని మోసగించిన జువెలరీ ఏజెంట్

**జూబ్లీహిల్స్, మే 31, ప్రభాతవార్త :** నగల వ్యాపారిని నమ్మించి రూ. 72 లక్షల విలువైన బంగారు నగలతో మాయమైన సంఘటన పంజాగుట్ట ఠాణా పరిధిలో చోటుచేసుకొంది. పంజాగుట్ట పోలీసుల కథనం ప్రకారం.. పంజాగుట్టలోని మోడల్ హౌస్‌లో జువెల్ బై నంద్‌లాల్ బంగారు నగల దుకాణం ఉంది. దుకాణ యజమాని నంద్‌లాల్ సోనికి గత పది నెలలుగా సుకేతు అనిల్‌షా కమిషన్ ఆధారిత జ్యువెలరీ ఏజెంట్‌గా వ్యాపార సంబంధాలు కొనసాగిస్తున్నాడు. గతంలో పలు మార్లు నగల నమూనాలను తీసుకెళ్లి తిరిగి ఇవ్వడంతో అతనిపై నమ్మకం ఏర్పడింది. ఈ క్రమంలో ఏప్రిల్‌లో సుకేతు అనిల్ షా రెండు చోకర్లు, ఒక మ్యాంగో నెక్లెస్, రెండు మ్యాంగో హారాలు, ఒక బట్టు హారం, ఒక గుట్టపూసల హారం సహా మొత్తం రూ. 72లక్షల విలువైన 1,518.5 గ్రాముల 22 క్యారెట్ బంగారు నగలను తీసుకెళ్లాడు. నగలను తీసుకెళ్లిన తర్వాత సుకేతు అనిల్ షా వాటిని తిరిగి ఇవ్వకుండా కాలయాపన చేయడమేకాకుండా బంజారాహిల్స్‌లోని ఆయన నివాసానికి వెళితే సుకేతు, అతని భార్య శృతి మరో ముగ్గురు వ్యక్తులు వారిని బెదిరించారు. నగలు తిరిగి ఇవ్వకపోగా, మొబైల్ ఫోన్ స్విచ్ ఆఫ్ చేసి అందుబాటులో లేకుండాపోయాడు. దీంతో ఉద్దేశపూర్వకంగానే మోసగించినట్లు యజమాని నంద్‌లాల్ సోని పంజాగుట్ట పోలీసులకు ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.




**చలాన్ల నుంచి తప్పించుకోవడానికి**

## నకిలీ నెంబర్ ప్లేట్... వ్యక్తి అరెస్టు

**హైదరాబాద్, మే 31 ప్రభాతవార్త :**

ట్రాఫిక్ చలాన్ల నుంచి తప్పించుకోవడానికి నకిలీ నెంబర్ ప్లేటును ఉపయోగిస్తూ నగరంలో తిరుగుతున్న ఓ వ్యక్తిని సుల్తాన్ బజార్ పోలీసులు అరెస్ట్ చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం హిమాయత్‌నగర్ ప్రాంతానికి చెందిన ఖాంచందాని బలరామ్ (59) అనే వ్యక్తికి హోండా యాక్టివా వాహనం ఉంది. దాని అసలు రిజిస్ట్రేషన్ సంబరు ఏపీ 09 సీహెచ్ 9428. అయితే, ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించినప్పుడు వచ్చే చలాన్ల నుంచి తప్పించుకోవడానికి బలరామ్ ఒక ఉపాయం ఆలోచించాడు. కవాడిగూడ ప్రాంతానికి చెందిన విజయ్ కుమార్ అనే వ్యక్తి వాహన నంబరైన ఏపీ 09 సీఎం 9428 గా తన నెంబర్ ప్లేటును మార్చేశాడు. బలరామ్ చేసిన తప్పులకు అమాయకుడైన విజయ్ కుమార్‌కు ట్రాఫిక్ చలాన్లు జారీ అయ్యాయి. ఇటీవల సుల్తాన్‌బజార్ పోలీసులు నిర్వహించిన వాహన తనిఖీల్లో బలరామ్ ప్రవర్తన అనుమానాస్పదంగా కనిపించింది. పోలీసులు అతడి వాహన పత్రాలను, నెంబర్ ప్లేట్ను క్షుణ్ణంగా పరిశీలించగా, అతడు అసలు సంబరును మార్చి, వేరొకరి నంబర్ ప్లేట్ వాడుతున్నట్లు ఆధారాలతో సహా దొరికిపోయింది. మరొకరిని ఇబ్బందులకు గురిచేస్తూ, ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతూ నకిలీ నెంబర్ ప్లేట్ వాడినందుకు గాను బలరామ్ పై పోలీసులు కేసునమోదు చేసి, అరెస్ట్ చేశారు.

మరో కేసులో టప్పాచబుత్ర పోలీస్ స్టేషన్ పరిధిలోని నటరాజ్‌నగర్‌కి చెందిన సయ్యద్ ఒమర్ అహ్మద్( 24) తన ద్విచక్ర వాహనం టీఎస్ 12ఈపీ 8323 నెంబర్‌ను చార్మినార్‌కు చెందిన అన్వర్ మన్సూరి వాహనం అయిన టీఎస్ 12ఈ బీ 8323 తప్పుగా మార్చి నగరంలో తిరుగుతున్నాడు. వాహన తనికిలో పోలీసులు గుర్తించి కేసునమోదు చేసి అరెస్ట్ చేశారు.

## టీజీ ట్రాన్స్‌కో సిఎండి పేరుతో సైబర్ మోసానికి యత్నం

**జూబ్లీహిల్స్, మే 31, ప్రభాతవార్త :** టీజీ ట్రాన్స్‌కో చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్(సీఎండీ) పేరుతో డబ్బులు కాజేయడానికి సైబర్ నేరగాళ్లు యత్నించిన సంఘటన ఖైరతాబాద్ ఠాణా పరిధిలో వెలుగుచూసింది. ఖైరతాబాద్ పోలీసుల కథనం ప్రకారం.. మే 30న మధ్యాహ్నం సమయంలో 9570916869 నంబర్ నుంచి టీజీ ట్రాన్స్‌కోలో ఫైనాన్షియల్ అడ్వైజర్, చీఫ్ కంట్రోలర్ ఆఫ్ అకౌంట్స్(ఆర్అండ్ఏ), చీఫ్ ఫైనాన్షియల్ ఆఫీసర్(సీఎఫ్ఓ)గా పనిచేస్తున్న టి.రమేష్‌బాబుకు వాట్సాప్ కాల్‌తో పాటు సందేశాలు వచ్చాయి. ఆ వాట్సాప్ ఖాతాలో టీజీ ట్రాన్స్‌కో సీఎండీ డి. కృష్ణ భాస్కర్ ఫొటోను డిస్‌ప్లే పిక్చర్‌గా ఉపయోగించి, తానే సీఎండీని అంటూ గుర్తు తెలియని వ్యక్తి మాట్లాడాడు. అనంతరం ఇండస్‌ఇండ్ బ్యాంకుకు చెందిన ఖాతాకు డబ్బులు బదిలీచేయాలని వాట్సాప్ ద్వారా కోరాడు. రమేష్‌బాబుకు అనుమానం రావడంతో ఆరా తీయగా సీఎండీ నుంచి ఎలాంటి సందేశాలు రాలేదని తేలింది. సీఎండీ ఫొటోను దుర్వినియోగం చేస్తూ టీజీ ట్రాన్స్‌కో ఖాతాల నుంచి నిధులు బదిలీ చేయించేందుకు మోసపూరితంగా ప్రయత్నించినట్లు గుర్తించారు. రమేష్‌బాబు ఫిర్యాదు మేరకు ఖైరతాబాద్ పోలీసులు సెక్షన్లు 66(సి), 66(డి), బీఎన్ఎస్ 318(4), 319(2)తోపాటు 62 సెక్షన్ కింద కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

### జాయింట్ సీపీ వాహనాన్ని ఢీకొట్టిన వాటర్ ట్యాంకర్

**జూబ్లీహిల్స్, మే 31, ప్రభాతవార్త :** బంజారాహిల్స్‌లో జాయింట్ సిపి ప్రయాణిస్తున్న వాహనాన్ని ఒక వాటర్ ట్యాంకర్ ఢీకొట్టింది. ఖైరతాబాద్ పోలీసుల కథనం ప్రకారం.. హైదరాబాద్ సిటీ పోలీస్ స్పెషల్ బ్రాంచ్ జాయింట్ కమిషనర్ విజయ్ కుమార్ మే 29 రాత్రి 9.30 గంటల సమయంలో బషీర్‌బాగ్‌లోని పాత కమిషనర్ కార్యాలయం నుంచి బంజారాహిల్స్ రోడ్ నంబర్10లోని అధికారిక నివాసానికి వెళ్తున్నారు. ఆయనతోపాటు గన్‌మన్ అర్జున్ కుమార్ కూడా ఉన్నారు. రాత్రి సుమారు 9.50 గంటల సమయంలో బంజారాహిల్స్‌లోని తాజ్ డెక్కన్ సమీపంలో ఉన్న అన్సారీ మంజిల్ యూటర్న్ వద్ద వెనుక నుంచి వచ్చిన వాటర్ ట్యాంకర్ టీఎస్12యూఈ2106 నిరక్ష్యంగా, అతివేగంగా నడుపుతూ ఒక్కసారిగా ఎడమవైపు మలుపు తిప్పడంతో జాయింట్ సిపి ప్రయాణిస్తున్న ఫార్చ్యూనర్ వాహనం టీఎస్09పీఏ1414ను ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో ఫార్చ్యూనర్ కారు వెనుకభాగం కొంత దెబ్బతింది. జాయింట్ సిపికి, వాహనంలో ప్రయాణిస్తున్న వారికి ఎలాంటి ప్రమాదం చోటుచేసుకోలేదు. ట్యాంకర్ డ్రైవర్‌ను హబీబ్ అలీగా గుర్తించారు. జాయింట్ సిపి డ్రైవర్ వడ్త్యావత్ రాము ఫిర్యాదు మేరకు ఖైరతాబాద్ పోలీసులు సెక్షన్లు 125, 281 కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# రహదారి... మృత్యుదారి

* తరచూ ప్రమాదాలు
* అపసవ్య దిశలో వాహనాలు
* యూటర్న్‌ల వద్ద దుర్ఘటనలు
* కాగితాలలోనే ఆర్వోబీలు




చాంద్రాయణగుట్ట డీఎల్ఆర్ఎల్ వద్ద ఆర్వోబి సైన్‌బోర్డు పిల్లర్ను ఢీ కొట్టిన కారు

**చాంద్రాయణగుట్ట, మే 31, ప్రభాతవార్త :** పాతబస్తీలోని హఫీజ్‌బాబానగర్-బండ్లగూడ ప్రధానరోడ్డు మృత్యుదారిగా మారింది. నిత్యం ఏదో ఒకచోట ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. కారణం మితిమీరిన వేగం, నెంబర్ ప్లేటులేని మైనర్ల జోరు, వాహనదారులలో ఓపిక కొరవడటం, ముందుకు దూసుకు పోవాలనే తాపత్రయం, త్రిబుల్ రైడింగ్, పోకిరీల రాష్ డ్రైవింగ్, రోడ్డు భద్రతా నియమాలు, ట్రాఫిక్ రూల్స్ పట్టించుకోకపోవటం, వీటన్నింటికి మించి సిగ్నల్ ఫ్రీ పేరుతో యూటర్న్‌ల ఏర్పాటు వెరసి రోడ్డు దుర్ఘటనలు చోటు చేసుకుంటున్నాయి. ఫలితంగా ఎంతో మంది అమాయక ప్రజలు మృత్యువాత పడుతున్నారు. బాబానగర్ చౌరస్తా, ఫూల్‌బాగ్ చౌరస్తా, చాంద్రాయణగుట్ట చౌరస్తా, అషమాబాద్ చౌరస్తా, బండ్లగూడ చౌరస్తాలను సిగ్నల్ ఫ్రీగా మార్చారు. కేవలం ఎంబిఎస్ఆర్ చౌరస్తా వద్ద మాత్రమే ట్రాఫిక్ సిగ్నల్స్ కొనసాగుతున్నాయి. యూ టర్న్ కారణంగా వాహనదారులు అంతదూరం వెళ్లలేక రాంగ్ రూట్‌లో ప్రయాణిస్తున్నారు. దీంతో సవ్యదశలో ప్రయాణించే వాహనదారులు తీవ్ర ఇబ్బందులుపడుతున్నారు. యూటర్న్ తిరిగే సమయంలో వెనుక నుండి వచ్చే కార్లు, భారీ వాహనాలు ద్విచక్ర వాహనదారులను ఢీకొడుతున్నాయి. ప్రమాదాలు చోటుచేసుకుంటు న్నాయి. ఉదాహరణకు బాబానగర్ రాఘవేంద్ర హోటల్ చౌరస్తా, హషమాబాద్ చౌరస్తా, ఇస్మాయిల్‌నగర్ జీపీఎస్ చౌరస్తాలలో ఎవరు ఎటు వైపు నుండి దూసుకువస్తారో తెలియని పరిస్థితి నెలకొంది. అక్కడక్కడ ట్రాఫిక్ పోలీసు లున్నా తీరిక లేకుండా ఉంటున్నారు. అడ్డదిడ్డ రాకపోక లను నియంత్రించలేక ఇటీవల కొత్తగా ట్రాఫిక్ సిగ్నల్స్ ఏర్పాటు చేశారు. ఇంకా అవి పూర్తిస్థాయిలో పనిచేయటం లేదు. అదేవిధంగా చాంద్రాయణగుట్ట చౌరస్తాలో రాంగ్ రూట్ వాహనదారుల హవా కొనసాగుతుంది. నల్లవాగు వైపు నుండి వచ్చే వాహనదారులు బంగారు మైసమ్మ చౌరస్తా మీదుగా పెట్రోలు బంక్ సమీపంలో యూటర్న్ తీసుకొని బార్కాస్, బండ్లగూడ వైపు వెళ్లాలి. ఇక్కడ ఆ పరిస్థితి లేదు. నేరుగా రాంగ్‌రూట్‌లో చౌరస్తా దాటుతు న్నారు. అసలే ఇరకు రోడ్డు, ఆపై ఆటోల పార్కింగ్‌తో వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు. దీనికి తోడు రాంగ్ రూట్ వాహనాలతో సవ్యదిశలో వెళ్లే వాహనదారులు నిత్యం ఇబ్బంది పడుతున్నారు. తరచూ ట్రాఫిక్ జామ్ ఏర్పడుతుంది. రాత్రివేళల్లో ప్రమాదాలు చోటుచేసుకుంటు న్నాయి. సమీప చౌరస్తాలో విధులు నిర్వహిస్తున్న ట్రాఫిక్ పోలీసులు వారిని నియంత్రించే ప్రయత్నం చేయటంలేదు. చూసి చూడనట్లు వ్యవహరిస్తున్నారు. కేశవగిరి చౌరస్తా పరిస్థితి అదేవిధంగా తయారైంది. చాంద్రాయణగుట్ట, ఎంబిఎస్ఆర్ చౌరస్తాలలోని జంట వంతెనలపై సైతం రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి. గతంలో ఫూల్‌బాగ్ చౌరస్తాలో డీసీఎం ఢీకొని ద్విచక్రవాహనంపై వెళుతున్న మైనర్ మృతి చెందాడు. కూరగాయల వ్యాన్ ఫల్టీకొట్టి ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. ఇక్కడ కొన్నిరోజులు చౌరస్తాను మూసి వేశారు. తిరిగి తెరవటంతో పరిస్థితి మొదటికి వచ్చింది. డీఎల్ఆర్ఎల్‌వద్ద ఆర్వోబి ప్రారంభంలో వాహనదారులు అదుపుతప్పి ప్రమాదాల బారిన పడుతున్నారు. ఈనెల 15వ తేదీ సాయంత్రం ఒక ద్విచక్ర వాహనదారుడు తీవ్రంగా గాయపడగా, ఈనెల 23న ఉదయం కారు అదుపుతప్పి ఆర్వోబి సైన్‌బోర్డు పిల్లర్ను ఢీకొట్టింది. కొద్దిసేపు ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. ఎంబిఎస్ఆర్ చౌరస్తాలో ఈనెల 13వ తేదీ రాత్రి కూరగాయలకు వెళ్ళి తిరిగి వస్తున్న ఒక వృద్ధుడిని కారు, కారును ఆర్టీసి బస్సు ఢీ కొట్టింది. ఈ సంఘటనలో వృద్ధుడుపై నుండి కారు వెళ్లి తీవ్ర గాయాలతో ఆసుపత్రికి తరలిస్తుండగా మృతి చెందాడు. ఈనెల 14న రాత్రి బండ్లగూడ హైవే రెస్టారెంట్ సమీపంలోని యూటర్న్ వద్ద శుభకార్యానికి వెళ్లి వస్తున్న భార్యాభర్తలు, ఇద్దరు పిల్లలతో వెళుతున్న ద్విచక్రవాహనాన్ని టిప్పర్ ఢీకొట్టింది. ఈదుర్ఘటనలో నవ వధువు అక్కడిక్కడే మృతి చెందింది. ఇలా అనేక సంఘటనలు చోటు చేసుకుంటున్నా కొన్ని మాత్రమే వెలుగు చూస్తున్నాయి. బాబానగర్ నుండి మైలార్‌దేవ్‌పల్లి వరకు తలపెట్టిన నాలుగు ఆర్వోబీల ప్రతిపాదన కార్యరూపం దాలిస్తే తప్ప రోడ్డు ప్రమాదాలకు ముకుతాడు పడే అవకాశంలేదు. ఈనెల 15న చాంద్రాయణగుట్ట ఎమ్మెల్యే అక్బరుద్దీన్ ఓవైసీ బల్దియా, ట్రాఫిక్ పోలీసులతో కలిసి ఆ మార్గాన్ని పరిశీలించారు. సాధ్యమైనంత తొందరగా ఆర్వోబిల నిర్మాణం చేపట్టాలని మహా కమిషనర్‌తో చర్చించారు. బండ్లగూడ పరిసరాలలో పెరిగిన కాలనీలు, ప్రధాన రోడ్డు మార్గంలో నిత్యం వేలాది వాహనాలు సాగిస్తున్న రాకపోకలతో 'రహదారి మృత్యుదారి'గా మారింది. ఈ సమస్యను పరిష్కరించాలంటే జూపార్కు నుండి ఆరాంఘర్ వరకు నిర్మించిన పొడవైన ఆర్వోబీ తరహాలో ఈ ప్రాంతంలో సైతం నిర్మించాల్సి ఉంది. భవిష్యత్ ట్రాఫిక్‌ను ఆలోచించి జీహెచ్ఎంసి ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని పాతనగర ప్రజలు కోరుతున్నారు.



తిరుమలగిరిలో ఓపెన్ జిమ్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే శ్రీగణేష్

## కంటోన్మెంట్ అభివృద్ధికి కృషి : ఎమ్మెల్యే

**కంటోన్మెంట్, మే 31 ప్రభాతవార్త:** కంటోన్మెంట్ నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాల్లో నెలకొన్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నామని ఎమ్మెల్యే ఎన్.శ్రీగణేష్ తెలిపారు. ఆదివారం 7వ వార్డు తిరుమలగిరి దుర్గా విహార్ కాలనీలో ఏర్పాటు చేసిన ఓపెన్ జిమ్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా శ్రీగణేష్ మాట్లాడుతూ ఆరోగ్యాన్ని కాపాడుకునేందుకు ఓపెన్ జిమ్ ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో కాలనీ పెద్దలు, పాపారావు,సుధాకర్, సీనియర్ సిటిజన్స్ నేతలు నాగేశ్వర్ సరిత, మురళి ముదిరాజ్,రంగా రవిందర్ గుప్త తదితరులు పాల్గొన్నారు.

**రామ్‌రాజ్ షోరూమ్‌ను ప్రారంభించిన ఎమ్మెల్యే...**

కంటోన్మెంట్ మిలటరీ డెయిరీ ఫాం రోడ్డులో నూతనంగా ఏర్పాటు చేసిన రామ్‌రాజ్ షోరూమ్‌ను ఎమ్మెల్యే ఎన్.శ్రీగణేష్ ప్రారంభించారు. కార్యక్రమంలో రామ్‌రాజ్ షోరూమ్ నిర్వాహకులు ఆదిత్య, లవకుమార్ పాల్గొన్నారు.

**10లో అత్యధిక మార్కులు సాధించడం అభినందనీయం...**

**అడ్డగుట్ట, మే 31 ప్రభాతవార్త:** ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు 10వ తరగతిలో అత్యధిక మార్కులు సాధించడం అభినందనీయమని కంటోన్మెంట్ ఎమ్మెల్యే ఎన్.శ్రీగణేష్ అన్నారు. జెసిఐ సికింద్రాబాద్, జూనియర్ ఛాంబర్ చారిటబుల్ ట్రస్ట్ సంయుక్త ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాలల్లో చదివిన 100 మంది బాలబాలికలకు మెరిట్ స్కాలర్‌షిప్‌ల పంపిణీ ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు.మోండా డివిజన్ మాజీ కార్పొరేటర్ కొంతం దీపిక మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో 10వ తరగతి చదివిన పేద విద్యార్థులకు మంచి ర్యాంకులు సాధించినందుకు ప్రతి ఏటా స్కాలర్‌షిప్‌లు అందజేయడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో జెసిఐ జాతీయ అధ్యక్షులు జేసీఐ భారత్ ఆచార్య,జోన్ అధ్యక్షులు గౌతమ్ జైన్, ప్రతినిధులు గంప నాగేశ్వర్ రావ్ తదితరులు పాల్గొన్నారు.

## పదవి విరమణ చేసిన ఉద్యోగులకు సన్మానం

**అడ్డగుట్ట, మే 31 ప్రభాతవార్త:** దేవాదాయశాఖలో క్రమశిక్షణతో విధులు నిర్వహించిన పదవి విరమణ చేసిన ఉద్యోగులను ఆదర్శంగా తీసుకొని తోటి ఉద్యోగులు విధులు నిర్వహించాలని ఆలయాల ఈఓలు సుధాకర్, మహేందర్ తెలిపారు. మారేడ్‌పల్లి శ్రీసుబ్రహ్మణ్యేశ్వర దేవాలయం సీనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహించిన చంద్రశేఖర్, రాజశేఖర్, ధర్మశాల పూజారి గంగ సత్తయ్యలు ఆదివారం పదవి విరమణ చేసిన సందర్భంగా తోటి ఉద్యోగులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఈఓతో పాటు ప్రధాన అర్చకులు రఘురామశర్మ, దేవాదాయ,ధర్మాదాయ జేఏసీ కమిటీ సభ్యులు రవీంద్రాచారి, కృష్ణమాచారి, ఆలయ మాజీ ధర్మకర్తలు గుజ్జు నాగేందర్ యాదవ్, నర్సింగ్‌రావ్, పరమేశ్వర్ పాల్గొని ఘనంగా సత్కరించారు.

## ఓడిపోయినా మారలేదు

(మొదటి పేజీ తరువాయి)

ఒక్క తెలంగాణ ఉద్యమకారుడి ఫోటోనా స్థానం కల్పించకపోవడం బాధాకరమన్నారు. పార్టీ కోసం జీవితాలను అంకితం చేసిన వారిని పక్కన పెట్టి, ఇటీవల ఇతర పార్టీల నుంచి వచ్చిన వారికే ప్రాధాన్యత ఇస్తున్నారని మండిపడ్డారు.

**మాట్లాడేందుకు మైక్ కూడా ఇవ్వలేదు**

సమావేశంలో కనీసం ఒక్క ఉద్యమకారుడికి కూడా వేదికపైకి ఆహ్వానించలేదని, తమ బాధలను చెప్పుకునేందుకు ప్రయత్నించినా మైక్ ఇవ్వకుండా అవమానించారని ఆరోపించారు. "తెలంగాణ ఉద్యమ సమయంలో గ్రామ గ్రామాన తిరిగి ప్రజల్లో చైతన్యం తీసుకువచ్చిన వారిని నేడు గుర్తించకపోవడం బాధాకరం. మాకు మాట్లాడటం నేర్పింది కేసీఆర్. ఉద్యమ సమయంలో మమ్మల్ని ముందుండి నడిపించిన నాయకత్వం నేడు మమ్మల్ని ఎందుకు గుర్తించట్లేదు? వేదికపై కూర్చోవడానికి, పార్టీ భవిష్యత్తుపై అభిప్రాయం చెప్పడానికి మాకు అర్హత లేదా?" అని వారు ప్రశ్నించారు.

**భాస్కర్ యాదవ్ తీరుపై భగ్గుమన్న అసంతృప్తి**

సమావేశంలో ఉద్యమకారులు తమ అభిప్రాయాలను వ్యక్తం చేస్తున్న సమయంలో జిల్లా గ్రంథాలయ మాజీ ఛైర్మన్, మేడ్చల్ మున్సిపల్ మాజీ అధ్యక్షుడు భాస్కర్ యాదవ్ వ్యవహరించిన తీరు మరింత వివాదాస్పదంగా మారింది.. ప్రశ్నలు లేవనెత్తిన ఉద్యమకారులను సముదాయించే బదులు వారిపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ అనుచిత వ్యాఖ్యలు చేసినట్లు ఆరోపణలు వినిపించాయి. ఇప్పటికే తమకు జరుగుతున్న అన్యాయాలపై ఆవేదనతో ఉన్న ఉద్యమకారులు, తమ ఆవేదనను గౌరవంగా వినాల్సిన నాయకత్వం అవమానకరంగా మాట్లాడటం మరింత బాధ కలిగించిందని వాపోయారు.

**అన్నీ ఒకే వ్యక్తి చేతుల్లోనే తిరుగుతున్నాయి**

సమావేశం అనంతరం పలువురు పార్టీ నాయకులు, కార్యకర్తల జరిగిన చర్చల్లో కూడా అసంతృప్తి వ్యక్తమైంది. పార్టీ కోసం ఎన్నో ఏళ్లుగా కష్టపడుతున్న నాయకులకు అవకాశాలు లేకుండా, ఒకే వ్యక్తి మాటే పార్టీ వ్యవహారాలు తిరుగుతున్నాయనే అభిప్రాయం వ్యక్తమైంది. మేడ్చల్ నియోజకవర్గంలో పార్టీ పదవులు, కార్యక్రమాలు, నిర్ణయాలు అన్నీ కొద్ది మంది చేతుల్లోనే కేంద్రీకృతమవుతున్నాయని, క్షేత్రస్థాయిలో పనిచేసిన ఉద్యమకారులు, సీనియర్ కార్యకర్తలకు సరైన గుర్తింపు దక్కడం లేదని నాయకులు పరస్పరం చర్చించుకున్నారు.

గత ఎన్నికల్లో పార్టీ పరాజయం పాలైనప్పటికీ నాయకత్వంలో ఎలాంటి మార్పు కనిపించడం లేదని విమర్శించారు. పార్టీకి నష్టం కలిగించిన వారికే మళ్లీ ముందుకు తీసుకొస్తున్నారని, కష్టకాలంలో పార్టీని మోసిన కార్యకర్తలను మాత్రం పూర్తిగా పక్కన పెడుతున్నారని ఆరోపించారు. పార్టీ ఆత్మపరిశీలన చేసుకోవాల్సిన సమయంలో కూడా అసలు సమస్యలను పక్కన పెట్టి ఉద్యమకారులను నిర్లక్ష్యం చేయడం సరైన విధానం కాదన్నారు. రావల్‌కోల్ క్రషర్ మిషన్ అంశంపై ఆవేదన...రావల్ కోల్ గ్రామంలో అక్రమంగా ఏర్పాటు చేస్తున్న క్రషర్ మిషన్కు వ్యతిరేకంగా గ్రామస్తులు, ఉద్యమకారులు కలెక్టరేట్ ముందు ధర్నాలు, నిరసనలు నిర్వహించినప్పటికీ పార్టీ అధిష్టానం, స్థానిక ముఖ్య నాయకులు స్పందించలేదని వారు ఆరోపించారు. ప్రజా సమస్యలపై స్పందించని నాయకత్వం కేవలం సమావేశాలు నిర్వహించడం ద్వారా కార్యకర్తల విశ్వాసాన్ని పొందలేదన్నారు.

**రేవంత్ ప్రభుత్వం గుర్తిస్తోంది..**

మన నాయకత్వానికి పట్టింపు లేదు....ప్రస్తుత రాష్ట్ర ప్రభుత్వం తెలంగాణ ఉద్యమకారుల గుర్తింపుకై చర్యలు తీసుకుంటూ 250 గజాల స్థలాల కేటాయింపు అంశంపై కమిటీ ఏర్పాటు చేసిన విషయాన్ని ప్రస్తావించిన ఉద్యమకారులు, గతంలో ఉద్యమాన్ని వ్యతిరేకించిన వారే ఇప్పుడు ఉద్యమకారులను గుర్తిస్తున్నారని అన్నారు. అయితే ఉద్యమం నుంచే పుట్టిన బీఆర్‌ఎస్ పార్టీ నాయకత్వానికి మాత్రం ఇప్పటికీ ఉద్యమకారుల విలువ తెలియడం లేదని తీవ్ర విమర్శలు గుప్పించారు.

తాము ఎప్పుడూ పార్టీలు మారలేదని, కేసీఆర్ ఇచ్చిన ఉద్యమ కండువానే ఇప్పటికీ గౌరవంగా ధరించి కొనసాగుతున్నామని స్పష్టం చేశారు. ఒక రోజు ఒక పార్టీలో, మరుసటి రోజు మరో పార్టీలో ఉండే నాయకులే ఇప్పుడు వేదికలపై కూర్చొని పార్టీ సిద్ధాంతాల గురించి మాట్లాడుతున్నారని, నిజంగా ఉద్యమంలో పాల్గొన్న వారు తమ ఆవేదన వ్యక్తం చేస్తే వారిని అడ్డుకునే ప్రయత్నాలు జరుగుతున్నాయని మండిపడ్డారు. ఉద్యమకారులను, సీనియర్ కార్యకర్తలను గుర్తించకుండా కొనసాగితే పార్టీ భవిష్యత్తులో మరింత నష్టపోయే ప్రమాదం ఉందని వారు హెచ్చరించారు. ఉద్యమకారుల ఆగ్రహావేశ వ్యాఖ్యలు, నాయకత్వంపై బహిరంగ విమర్శలు, వాటికి ప్రతిస్పందనగా చోటుచేసుకున్న వాగ్వివాదాలతో సమావేశ ప్రాంగణంలో కొంతసేపు ఉద్రిక్త వాతావరణం నెలకొంది. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మేడ్చల్ నియోజకవర్గ ఇంచార్జ్ మహేందర్‌రెడ్డి, ఎల్లంపేట మున్సిపల్ చైర్మన్ శ్రీదేవి, కౌన్సిలర్లు, పార్టీ నాయకులు శ్రీనివాస్ రెడ్డి, మల్లికార్జున్ స్వామి, రాజమల్లారెడ్డి, భాస్కర్ యాదవ్, భాగ్యరెడ్డి, దయానంద్ యాదవ్, నవీనరెడ్డి, రాగజ్యోతి, విష్ణుచారీ, సంజీవరావు, ప్రవీణ్, మోహన్‌రెడ్డి, శైలేందర్ తదితరులు పాల్గొన్నారు.

# సంస్కృతి సంప్రదాయాలను పిల్లలకు తెలిసేలా చేయాలి

మాజీ మంత్రి, ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్



వేసవి శిబిరం ముగింపులో పిల్లలతో తలసాని శ్రీనివాస్‌యాదవ్

**సంజీవరెడ్డినగర్, మే 31, ప్రభాతవార్త :** మన సంస్కృతి, సాంప్రదాయాల గొప్పతనం, పండుగల విశిష్టతను పిల్లలకు తెలియజేయాల్సిన బాధ్యత తల్లిదండ్రులపై ఉందని మాజీ మంత్రి, సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ అన్నారు. సనత్ నగర్‌లోని సంకేత్ సోషల్ వెల్ఫేర్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన సమ్మర్ క్యాంప్ ముగింపు శిబిరానికి ముఖ్యఅతిధిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా విద్యార్థుల నృత్య ప్రదర్శన ఆకట్టుకుంది. అనంతరం తలసాని మాట్లాడుతూ వెస్ట్రన్ కల్చర్‌కు అలవాటుపడిన నేటితరం పిల్లలలో అనేకమందికి మన సంస్కృతి, పండుగల గురించి తెలవకపోవడం బాధాకరమన్నారు. ప్రపంచంలోని అనేక దేశాలు మన సాంప్రదాయాలు, పండుగలు, ఆచారాలను గౌరవిస్తూ ఎంతో గొప్పగా జరుపుకుంటున్నారని తెలిపారు. విద్యార్థి దశ నుంచే పిల్లలను చదువుతో పాటు క్రీడలు, సాంస్కృతిక రంగాలలో ప్రోత్సహించాలని తల్లిదండ్రులను కోరారు. వేసవి సెలవుల్లో ఉచిత శిబిరాలను నిర్వహించి పిల్లలకు శిక్షణ కార్యక్రమాలు నిర్వహించడం పట్ల నిర్వాహకులను అభినందించారు. పిల్లలకు ఏ రంగాలలో ఆసక్తి ఉందో గుర్తించి ఆ రంగాలలో వారిని ప్రోత్సహించాలని సూచించారు. సెల్‌ఫోన్‌లు వచ్చిన తర్వాత కుటుంబ సభ్యులతో గడిపే సమయం కంటే సెల్‌ఫోన్‌లలో గడిపే సమయమే అధికంగా ఉంటుందన్నారు. నియోజకవర్గ ప్రజలు అంతా సంతోషంగా ఉండాలనే లక్ష్యంతోనే రోడ్ల నిర్మాణం, డ్రైనేజీ వ్యవస్థ అభివృద్ధి, పార్క్‌ల అభివృద్ధి వంటి అనేక పనులు చేపట్టి ప్రజల సమస్యలను పరిష్కరించిన విష యాన్ని గుర్తు చేశారు. అనంతరం సమ్మర్ క్యాంప్ లో శిక్షణ పొందిన విద్యార్థులకు సర్టిఫికెట్‌లను అందజేశారు. 16 మంది పేద విద్యార్థులకు రూ. 4.05 లక్షల విలువైన ఆర్థిక సహాయం చెక్కులను పంపిణీ చేశారు.కార్యక్రమంలో సనత్‌నగర్ డివిజన్ బిఆర్‌ఎస్ పార్టీ అధ్యక్షుడు కొలన్ బాల్‌రెడ్డి, నిర్వాహకులు మురళి, మమత సోని, ధనశ్రీ, సీనియర్ సిటిజన్ జె ఎస్టీ సాయి, నాయకులు సురేష్ గౌడ్, రమేష్ గౌడ్, ప్రవీణ్ రెడ్డి, కరుణాకర్ రెడ్డి, ఖలీల్,



యూనస్‌ను సన్మానిస్తున్న మైనార్టీ నాయకులు

## ముస్లిం ఫకీర్ బీసీఈ 4 సంక్షేమ సంఘం
## మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా నూతన కమిటీ ఎన్నిక

**నాచారం, మే 31 ప్రభాతవార్త :** తెలంగాణ రాష్ట్ర ముస్లిం ఫకీర్ బీసీ ఈ 4 సంక్షేమ సంఘం మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా నూతన కమిటీని రాష్ట్ర నాయకత్వం ఆధ్వర్యంలో ఆదివారం ఎన్నుకున్నారు. రాష్ట్ర కమిటీ అధ్యక్షులు మహమ్మద్ సలీం అధ్యక్షతన, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి షేక్ మసూద్ అలీ ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో రాష్ట్ర గౌరవ అధ్యక్షులు షేక్ ఫక్రుద్దీన్, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ మహమ్మద్ ఫరీద్ సమక్షంలో జిల్లా కమిటీని ఏకగ్రీవంగా ఎంపిక చేశారు.ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులుగా నాచారం బాబానగర్‌కు చెందిన మహమ్మద్ యూనూస్‌ను, ఉపాధ్యక్షులుగా మోలాలికి చెందిన మహమ్మద్ ఖాసిం, అడ్డగుట్టకు చెందిన మహమ్మద్ ఇబ్రహీంను ఎన్నుకున్నారు. వర్కింగ్ ప్రెసిడెంట్‌గా మోలాలికి చెందిన మహమ్మద్ జాంగీర్, ప్రధాన కార్యదర్శిగా అస్మత్‌పేటకు చెందిన మహమ్మద్ షరీఫ్ బాధ్యతలు చేపట్టనున్నారు. అదేవిధంగా కార్యదర్శులుగా షాపూర్‌కు చెందిన మహమ్మద్ సలీం, వసీంలను, కోశాధికారిగా మహమ్మద్ రియాజ్‌ను నియమించారు. సలహాదారులుగా మహమ్మద్ చాంద్‌పాషా, మహమ్మద్ మదార్‌లను, ఎగ్జిక్యూటివ్ సభ్యులుగా ఎం.డి. ఖదీర్, అన్వర్, జాంగీర్‌లను ఎన్నుకున్నారు. నూతనంగా ఎన్నికైన కమిటీ సభ్యులను రాష్ట్ర నాయకులు అభినందించి, ముస్లిం ఫకీర్ బీసీ ఈ4 వర్గాల సంక్షేమం, హక్కుల సాధన కోసం సమష్టిగా కృషి చేయాలని సూచించారు. జిల్లాలో సంఘాన్ని మరింత బలోపేతం చేస్తూ సభ్యుల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో సంఘం నాయకులు, సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## నాయకులకు, కార్యకర్తలకు అండగా ఉంటా : ఎమ్మెల్యే

**నాచారం, మే 31 ప్రభాతవార్త :** నాయకులు, కార్యకర్తలకు అండగా ఉంటానని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి పేర్కొన్నారు. నాచారం సికె గార్డెన్‌లో బిఆర్‌ఎస్ నాయకులు సాయిజన్ శేఖర్, మల్లికార్జున్ ఆధ్వర్యంలో బీఆర్‌ఎస్ పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన ఎమ్మెల్యే దిశా నిర్దేశం చేశారు. పార్టీ బలంగా ఉండాలంటే విరివిగా సభ్యత్వ నమోదు చేయించాలని విజ్ఞప్తి చేశారు. అన్ని డివిజన్లలో ఎక్కడ సమస్య వచ్చినా వెంటనే స్పందిస్తానని చెప్పారు. నాచారంలో దోమల సమస్యకు పరిష్కారం చేయడం జరిగిందన్నారు. నాచారం, హెచ్ఎంటీనగర్ డివిజన్‌లలో గత పదేళ్లలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి పనులు ప్రజల మన్ననలు పొందాయని అన్నారు. తాను ఎమ్మెల్యేగా ఎన్నికైన నాటి నుంచి నియోజకవర్గంలోని సమస్యల పరిష్కారానికి వందల కోట్లాది పాయల నిధులను తీసుకువచ్చి అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామని పేర్కొన్నారు. అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల పట్ల ప్రజల్లో బీఆర్‌ఎస్ పార్టీకి విశేష ఆదరణ ఉందని, ఈ నేపథ్యంలో సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ప్రతి కార్యకర్త బాధ్యతగా తీసుకుని విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. పార్టీ బలోపేతానికి సభ్యత్వ నమోదు కీలకమని, ప్రతి ఇంటికి చేరుకుని పార్టీ సిద్ధాంతాలను ప్రజలకు వివరించాలని సూచించారు.సమావేశంలో బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## మన్‌కీ బాత్‌ను వీక్షించిన బిజెపి నేతలు

**గన్‌ఫౌండ్రి, మే 31 ప్రభాతవార్త:** ప్రధాన మంత్రి నరేంద్రమోదీ మన్‌కీ బాత్ ద్వారా ప్రజలు బిజెపి కిందిస్థాయి నుంచి మొదలు కొని జాతీయ స్థాయి నాయకులు, మంత్రులు వీక్షించడం ద్వారా దేశాభివృద్ధి తెలుసుకోవడం జరుగుతుందని బిజెపి ఎస్సీ మోర్చ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఓంప్రకాష్‌బిస్వా అన్నారు. ఆదివారం గన్‌ఫౌండ్రి బిజెపి కార్యాలయంలో దేశ ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ 134వ మన్‌కీ బాత్ లైవ్ కార్యక్రమాన్ని గోషామహల్ నియోజకవర్గానికి చెందిన బిజెపి నాయకులు మాజీ కార్పొరేటర్ డాక్టర్ సురేఖ ఓంప్రకాష్‌బిస్వా, గోవింద్‌నారాయణరాఠి, రఘునందన్‌యాదవ్, వివేక్, రాకేష్, నితిన్, జ్ఞానేశ్వర్, నిర్మల్‌రాజ్, రంజిత్‌ప్రకాష్, శ్రీకాంత్, దీపక్, దేవరాజ్, మల్లేష్, సాయిగౌడ్, సురేందర్‌శర్మ, విజయ్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు.




జీవనసాఫల్య పురస్కార గ్రహీతలతో వనజ ఉదయ్, రమాదేవి తదితరులు

## నయన మనోహరం రీట్‌కళా నాట్యోత్సవం

**రవీంద్రభారతి, మే 31 ప్రభాతవార్త :** ప్రముఖ రీట్‌కళా సంఘం నృత్య సంస్థ ఆధ్వర్యంలో రవీంద్రభారతిలో సంస్థ 5వ వార్షికోత్సవ వేడుకలను పురస్కరించుకుని నిర్వహించిన నాట్యోత్సవం నయనమనోహరంగా ప్రేక్షకులను తన్మయుల్ని చేసింది. ముఖ్యంగా భువనేశ్వర్‌కు చెందిన ప్రముఖ ఒడిస్సీ నర్తకీమణి డా. సుభాశ్రీపట్నాయక్, ఢిల్లీకి చెందిన వినోద్ కెవిన్‌బచ్చన్ ఒడిస్సీ నృత్యప్రదర్శనలు విశేషంగా ఆకట్టుకుని ఎంతగానో అలరించాయి. గురు బాలాజీ కుమార్ శిష్యబృందం, అనుదీప్తి శిష్యబృందం కూచిపూడి బృంద నృత్య ప్రదర్శనలు నేత్రపర్వంగా సాగాయి. 50మందికిపైగా యువనర్తకులు అద్భుతంగా నర్తించి ఆహుతులను ఎంతగానో మెప్పించి తమ కళాకౌశలాన్ని ప్రదర్శించి ప్రశంసలు అందుకున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా విచ్చేసిన సురవరం ప్రతాపరెడ్డి తెలుగు విశ్వవిద్యాలయం అకడమిక్ డీన్ డా. వనజ ఉదయ్, ప్రముఖ నాట్యవిద్వాన్ డా. రమాదేవిలు, నిర్వాహకురాలు రాజశ్రీ పట్నాయక్ తదితరులు ఐదవ వార్షికోత్సవం జరుపుకుంటున్న సంస్థను, నేటి అద్భుత ప్రదర్శనలు కావించి సంస్థ శిష్యులను కొనియాడుతూ శుభాభినందనలు తెలిపారు. ప్రఖ్యాత ఒడిస్సీ నర్తకి రంజనగౌర్, సుభాశ్రీ పట్నాయక్‌లను సత్కరించి రీత్‌కళాసంగం జీవన సాఫల్య పురస్కారం ప్రదానం చేశారు.

## తెలుగు వర్సిటీ రంగస్థల కళల శాఖ కోర్సులకు ఆహ్వానం

**నాంపల్లి, మే 31 ప్రభాతవార్త :** సురవరం ప్రతాపరెడ్డి తెలుగు విశ్వవిద్యాలయం రంగస్థల కళలశాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పలు కోర్సులకు ఆసక్తి గల ఔత్సాహికులను ఆహ్వానిస్తున్నట్లు శాఖ అసిస్టెంట్ ప్రొఫెసర్ డా. ఆంథోని రాజ్ తెలిపారు. 6నెలల డిప్లొమా ఇన్ ఫిల్మ్ డైరెక్షన్, ఎంపిఏ(థియేటర్ ఆర్ట్స్) (నటన); డిప్లొమా ఇన్ మిమిక్రీ కోర్సులున్నట్లు ఆయన పేర్కొన్నారు. మొబైల్ నంబరు 9346461733లో విశ్వవిద్యాలయం అందిస్తున్న ఈ కోర్సులకు సంబంధించిన పూర్తి వివరాల కోసం సంప్రదించవచ్చునని ఎ.రాజ్ వెల్లడించారు.

## ఆకట్టుకున్న శ్రీకృష్ణలీలలు, పాతాళభైరవి నాటకాలు

**నాంపల్లి, మే 31 ప్రభాతవార్త :** నిరాదరణకు గురవుతున్న నాటకరంగానికి ఊతం, ప్రోత్సాహంతోపాటు అభ్యున్నతికి సురభి నాటకం చేస్తున్న మేలు, అండదండలు అనిర్వచనీయమని వక్తలు ప్రశంసించారు. సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సాంస్కృతిక విభాగం కన్వీనర్ జమలాపురం రాధాకృష్ణ నిర్వహణలో రెండురోజులపాటు సురభి నాటక సమాజం సాయి సంతోషి నాట్యమండలివారిచే పాతాళభైరవి జానపద నాటకం, శ్రీకృష్ణలీలలు పౌరాణిక నాటక ప్రదర్శనలు ఆహుతులను కట్టిపేశాయి. అద్భుత సాంకేతిక పరిజ్ఞానంతో ప్రదర్శించిన ఈ నాటకాలను తిలకించిన ప్రేక్షకులు, రంగస్థల ప్రియులు తన్మయత్వం పొందారు. టీవీఫేమ్ బిత్తరసత్తి పోషించిన పాత్ర ప్రతీఒక్కరినీ ఆకట్టుకుంది. నాటక ప్రదర్శనకు అవకాశం కల్పించిన రాధాకృష్ణకు సమాజం తరపున సురభి సంతోష్‌కుమార్ ధన్యవాదాలు తెలిపారు. చివరిగా నాటకాల్లో నటించిన కళాకారులను ఘనంగా సన్మానించారు.



నాటక కళాకారులతో రాధాకృష్ణ, సంతోష్‌కుమార్ తదితర అతిథులు

# 2029కైనా మహిళా రిజర్వేషన్లు అమలవుతాయా?

హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ రాధారాణి




మాట్లాడుతున్న రాధారాణి

**చిక్కడపల్లి, మే 31 (ప్రభాతవార్త) :** చట్టసభల్లో 33 శాతం మహిళా రిజర్వేషన్లు 2029 ఎన్నికల నాటికైనా అమలవుతాయా? అని హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి, రాష్ట్ర వినియోగదారుల వివాదాల పరిష్కార కమిషన్ చైర్మన్ జస్టిస్ జి.రాధారాణి సందేహం వ్యక్తం చేశారు. ఆదివారం బాగ్‌లింగంపల్లి సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో రాజ్యాంగ పరిరక్షణ వేదిక ఆధ్వర్యంలో జరిగిన సదస్సులో ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. ప్రపంచ వ్యాప్తంగా 1920 నాటికే చట్టసభల్లో మహిళలకు రిజర్వేషన్లు కల్పించారని, రువాండా, కాంగో లాంటి దేశాల్లో 60 శాతానికిపైగా, యూరోపియన్ యూనియన్ దేశాల్లో 25 శాతంపైగా మహిళా ప్రాతినిధ్యం ఉందని ఆమె గుర్తుచేశారు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చి ఇన్ని దశాబ్దాలైనా చట్టసభల్లో మహిళల ప్రాతినిధ్యం 14 శాతం దాటకపోవడం విచారకరమన్నారు. మహిళా రిజర్వేషన్ల బిల్లు 2023లోనే చట్టంగా మారినప్పటికీ పురుషాధిక్య రాజకీయ పార్టీలు తమ అధికారాలు పోతాయనే భావనతో దీని అమలును జనాభా గణన,నియోజకవర్గాల పునర్విభజన ప్రక్రియలతో ముడిపెట్టడం భావ్యం కాదని స్పష్టం చేశారు. డీలిమిటేషన్ అంశాన్ని పార్లమెంటే తేల్చాల్సి ఉండగా, కమిటీని వేసి శాసన నిర్వాహకులకు వదిలేయడం వల్ల భవిష్యత్తులో కోర్టుల చుట్టూ తిరగాల్సి వస్తుందని, తద్వారా మహిళా రిజర్వేషన్లు మరింత ఆలస్యమయ్యే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు.జనాభా ఆధారంగా నియోజకవర్గాలు, నిధులు కేటాయిస్తే ఉత్తరాది రాష్ట్రాలకే ఎక్కువ లాభం చేకూరుతుందని, దీనివల్ల ప్రాంతీయ విభేదాలు, విభజన వాదాలు తలెత్తే ప్రమాదం ఉందని హెచ్చరించారు. అందువల్ల జనాభా గణనతో సంబంధం లేకుండా ప్రస్తుతం ఉన్న 543 పార్లమెంట్ స్థానాల్లోనే 33 శాతం మహిళా రిజర్వేషన్లను తక్షణమే అమలుచేయాలని ఆమె డిమాండ్ చేశారు. ప్రముఖ న్యాయకోవిదులు మాడభూషి శ్రీధర్ మాట్లాడుతూ మహిళలు రాజ్యాంగం, చట్టాలు, రాజకీయాలపై పూర్తి అవగాహన పెంచుకోవాలని సూచించారు. తెలంగాణ హైకోర్టు సీనియర్ న్యాయవాది జి.విద్యాసాగర్ అధ్యక్షత వహించిన ఈ కార్యక్రమంలో రాజ్యాంగ పరిరక్షణ వేదిక నాయకులు కె. ఉమామహేశ్వరరావు, డి.ఎ.ఎస్.వి.ప్రసాద్, కామేష్ బాబు, వీరయ్య, నాగలక్ష్మి ్మ, ఇందిర, డి.జి. నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

## ఐఎన్‌టియుసి మేడ్చల్ జిల్లా అధ్యక్షుడిగా అత్వెల్లి రవికాంత్

**దుండిగల్, మే 31, ప్రభాతవార్త :** భారత జాతీయ కార్మిక కాంగ్రెస్ (ఐఎన్‌టీయూసీ) ఆధ్వర్యంలో కార్మిక ఉద్యమానికి మరింత బలం చేకూరే విధంగా మేడ్చల్ జిల్లా అధ్యక్షుడిగా అత్వెల్లి రవికాంత్ నియమితులయ్యారు. ఈ సందర్భంగా ఐఎన్‌టీయూసీ జాతీయ అధ్యక్షుడు సంజీవరెడ్డి చేతుల మీదుగా రవికాంత్ నియామక పత్రాన్ని అందుకున్నారు. ఈ కార్యక్రమంలో ఐఎన్‌టీయూసీ ఉపాధ్యక్షుడు, తెలంగాణ జలమండలి అధ్యక్షుడు మొగుల్ల రాజిరెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని రవికాంత్‌కు శుభాకాంక్షలు తెలిపారు. కార్మికుల హక్కుల పరిరక్షణ, సంక్షేమం, ఉద్యోగ భద్రత కోసం మరింత సమర్థవంతంగా పనిచేయాలని ఆకాంక్షించారు. అలాగే ఐఎన్‌టీయూసీ కార్యదర్శి చంద్రశేఖర్‌తో పాటు తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ ప్రోటోకాల్, సమన్వయ విభాగం ఉపాధ్యక్షుడు బి. కిషోర్ రెడ్డి, పలువురు నాయకులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ కార్మికుల సమస్యల పరిష్కారం, సంక్షేమ పథకాల అమలు, ఉద్యోగుల హక్కుల సాధనలో ఐఎన్‌టీయూసీ ఎల్లప్పుడూ ముందుంటుందని తెలిపారు. అత్వెల్లి రవికాంత్ నాయకత్వంలో మేడ్చల్ జిల్లాలో కార్మిక ఉద్యమం మరింత బలోపేతం అవుతుందని విశ్వాసం వ్యక్తం చేశారు.

## ట్రాఫిక్ సమస్యకు పరిష్కారానికి చర్యలు చేపట్టడం హర్షణీయం : టిడిపి నేత నగేష్ ముదిరాజ్

**నిజాంపేట్, మే 31, ప్రభాతవార్త :** ప్రగతినగర్ ప్రజలను ఎన్నో ఏళ్లుగా వేధిస్తున్న ట్రాఫిక్ సమస్యకు పరిష్కారం దిశగా ప్రభుత్వం చర్యలు చేపట్టడం హర్షణీయమని తెలుగుదేశం పార్టీ నాయకుడు నగేష్ ముదిరాజ్ పేర్కొన్నారు.ముఖ్యంగా పాఠశాలలు ప్రారంభమయ్యే సమయంలో ట్రాఫిక్ సమస్య తీవ్రరూపం దాల్చి విద్యార్థులు, తల్లిదండ్రులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. ఈ సమస్యపై తాను గతంలో అనేకసార్లు సామాజిక మాధ్యమాల ద్వారా, అలాగే సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. ట్రాఫిక్ సమస్యకు శాశ్వత పరిష్కారం కోసం పలు ప్రత్యామ్నాయ మార్గాలు, సూచనలను అధికారులకు అందించినట్లు చెప్పారు. ప్రస్తుతం ప్రభుత్వం సమస్యపై దృష్టి సారించి ప్రత్యామ్నాయాల పరిశీలనకు చర్యలు ప్రారంభించడం అభినందనీయమన్నారు. త్వరలో సరైన నిర్ణయాలు తీసుకుని ప్రగతినగర్ ప్రజలకు ట్రాఫిక్ సమస్య నుంచి శాశ్వత ఉపశమనం కల్పిస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రజల రాకపోకలకు ఇబ్బందులు లేకుండా, భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని సమగ్ర ప్రణాళికతో చర్యలు చేపట్టాలని నగేష్‌ముదిరాజ్ కోరారు.

## ఆర్టీసీ రిటైర్డ్ ఉద్యోగుల బకాయిలను చెల్లించాలి



పికెట్ గార్డెన్‌లో ఆర్టీసీ రిటైర్డ్ ఉద్యోగుల సమావేశం

**కంటోన్మెంట్, మే 31 ప్రభాతవార్త:** ఆర్టీసీలో పనిచేసిన రిటైర్డ్ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని రిటైర్డ్ ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్షులు కె.ఎం.ఎస్.రెడ్డి, కార్యదర్శి కిషోర్‌కుమార్, కోశాధికారి కె.దుర్గయ్య, లీగల్ అడ్వైజర్ ప్రసాద్ డిమాండ్ చేశారు. ఆదివారం కంటోన్మెంట్ పికెట్ గార్డెన్‌లో ఆర్టీసీ రిటైర్డ్ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి చేపట్టాల్సిన కార్యాచరణపై సమావేశమైయ్యారు. 2017, 2021 పే స్కేల్ బకాయిలు,లీవ్ ఎన్ క్యాస్‌మెంట్,డిఏ బ్యాలెన్స్ అమౌంట్ సకాలంలో ఇచ్చే విధంగా ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చేందుకు సంఘటితంగా ఉద్యమించాలన్నారు.

## సిఎంపై అనుచిత వాఖ్యలు చేస్తే సహించేది లేదు : సరిత



మాట్లాడుతున్న కాంగ్రెస్ నేతలు నాగి నేని సరిత తదితరులు

**కంటోన్మెంట్, మే 31 ప్రభాతవార్త:** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేపడుతున్న అభివృద్ధి,సంక్షేమ పథకాలను చూసి ఓర్వలేక కేటీఆర్ సిఎం రేవంత్ రెడ్డిపై అనుచిత వాఖ్యలు చయడం సరైంది కాదని కాంగ్రెస్ అధికార ప్రతినిధి నాగినేని సరిత తెలిపారు. ఆదివారం బోయిన్‌పల్లిలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆమె మాట్లాడుతూ కేసిఆర్,కేటీఆర్ అడబిడ్డకే మర్యాద ఇవ్వని వారు సిఎం రేవంత్‌రెడ్డిని,కంటోన్మెంట్ ఎమెమ్మెల్యేను విమర్శించే విధంగా వాఖ్యలు చేస్తే వారికి తగిన బుద్ధి చెప్పాల్సి వస్తుందని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు స్యామ్‌సన్ రాజు, మారుతీగౌడ్,జమీల్, బల్వంత్‌రెడ్డి, రేపాల వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

## చెన్నమల్లికార్జున స్వామిని దర్శించుకున్న వైశ్యులు

**చాంద్రాయణగుట్ట, మే 31, ప్రభాతవార్త :** హైదరాబాద్ వాసవీ క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం చాంద్రాయణగుట్ట కేశగిరిపై వెలసిన భ్రమరాంబ దేవి సమేత చెన్నమల్లిఖార్జున స్వామిని దర్శించుకున్నారు. ఆలయ ప్రధాన అర్చకులు కోటి హరీష్‌కుమార్ వారిచే ఆలయంలో స్వామి అమ్మవార్లకు అర్చన జరిపించారు.అనంతరం ఆలయంలోని ఉపాలయాలను దర్శింపజేశారు. తర్వాత వారిని శేష వస్త్రంతో సన్మానించి ఆశీర్వచనాలు పలికారు. నాచారం ప్రభాకర్, వాసవి క్లబ్ అధ్యక్షులు అల్లాడి హరీష్‌కుమార్, ఎన్. ప్రభాకర్, కె.అనంతనారాయణ, కె.వెంకటేష్‌రాజ్, కె.సృజన్‌కుమార్, ఎన్. శ్రీనివాస్, వేణుగోపాల్,లింగయ్య, బి.శ్రీనివాస్, యు.కృష్ణ, వి.సత్యనారాయణ, సుమారు 200 మంది వైశ్య కుటుంబసభ్యులు పాల్గొన్నారు.

## బిఆర్‌ఎస్ సభ్యత్వ నమోదు చేయాలి : నరేందర్‌గౌడ్

గోషామహల్, మే 31 ప్రభాతవార్త : రాష్ట్ర ప్రభుత్వం అవలంభిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజలకు వివరిస్తూ బిఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు, ఉద్యమ కారులు సభ్యత్వ నమోదు చేపట్టాలని గోషామహల్ నియోజకవర్గం బిఆర్‌ఎస్ పరిశీలకులు నాగేందర్‌గౌడ్ సూచించారు. ఈ మేరకు ఆదివారం గోషామహల్ నియోజకవర్గం బిఆర్‌ఎస్ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో భాగంగా(సర్), పార్టీ కమిటిలకు సంబంధించిన విషయంపై చర్చ కొనసాగింది. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ బిఆర్‌ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షులు కెటిఆర్ పార్టీ కోసం కష్టపడి పని చేసే వారికి పార్టీలో తప్పకుండా గుర్తింపు లభిస్తుందన్నారు. బిఆర్‌ఎస్ సభ్యత్వ నమోదును గోషామహల్ నియోజకవర్గంలో కలిసి కట్టుగా సభ్యత్వ నమోదు చేస్తామని గోషామహల్ నియోజకవర్గం బిఆర్‌ఎస్ ఇన్‌చార్జ్ ఆర్వీ మహేందర్‌కుమార్, హైదరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం బిఆర్‌ఎస్ ఇన్‌చార్జ్ గడ్డంశ్రీనివాస్‌యాదవ్‌లు పేర్కొన్నారు. సమావేశంలో ఏడు డివిజన్ల నాయకులు, కార్యకర్తలు, ఉద్యమకారులు శాంతిదేవి, బెజ్జిని శ్రీనివాస్, కె.ప్రదీప్‌రాజ్, రమేష్‌గుప్త, మీసాలక్రాంతి తదితరులు పాల్గొన్నారు.

## అపార్ట్‌మెంట్ పై అంతస్తు నుంచి పడి వ్యక్తి మృతి

**పేట్‌బషీరాబాద్, మే 31, ప్రభాతవార్త :** కొంపల్లి సినీ ప్లానెట్ లైన్‌లోని పావని రెసిడెన్సీ అపార్ట్‌మెంట్ పై అంతస్తు నుంచి ప్రైవేట్ ఉద్యోగిగా పనిచేస్తున్న నాగభూషణం(40) పడి మృతి చెందిన సంఘటన పేట్ బషీరాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. కుటుంబ సభ్యులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఆదివారం మధ్యాహ్నం సుమారు 12 గంటల సమయంలో మృతుడి భార్య ఇంట్లో ఫోన్‌లో మాట్లాడుతుండగా, అపార్ట్‌మెంట్ వాచ్‌మన్ కుమారుడు వచ్చి పైఅంతస్తు నుంచి ఎవరో కిందపడినట్లు సమాచారం అందించాడు. వెంటనే మృతుడి కుమారుడు పుష్పలీల ఘటనాస్థలానికి వెళ్లి పరిశీలించగా, కిందపడిన వ్యక్తి తండ్రి నాగభూషణమేనని గుర్తించాడు. అనంతరం కుటుంబ సభ్యులు వెంటనే నాగభూషణంను సమీపంలోని శ్రీకర ఆసుపత్రికి తరలించగా, అప్పటికే ఆయన మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ప్రాథమిక సమాచారం ప్రకారం కాలుజారి ప్రమాదవశాత్తు కిందపడడం వల్ల లేదా ఇతర కారణాలతో ఈ ఘటన జరిగి ఉండవచ్చని భావిస్తున్నారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి అన్ని కోణాల్లో దర్యాప్తు చేపట్టారు. మృతికి గల ఖచ్చితమైన కారణాలు విచారణ అనంతరం వెల్లడికానున్నాయి. ఈ ఘటనతో పావని రెసిడెన్సీ అపార్ట్‌మెంట్‌లో విషాద ఛాయలు అలుముకున్నాయి.